## నేడు జిహెచ్ఎంసి " ప్రత్యేక కౌన్సిల్ మీటింగ్ "

**-మేయర్ అధ్యక్షతన ఉదయం 10.30కి ప్రారంభం**

**-వార్డుల విభజనపై వాడివేడి చర్చ జరిగే అవకాశం**



**హైదరాబాద్ డిసెంబరు 15,ప్రభాతవార్త:** శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసిన తర్వాత వార్డుల విభజనపై సభ్యుల అభిప్రాయాలు సేకరించేందుకు జిహెచ్ఎంసి ప్రత్యేక కౌన్సిల్ మీటింగ్ మంగళవారం నిర్వహిస్తుంది. ఈమేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశంలో తమకు జరుగుతున్న అన్యాయాలపై తమగళాన్ని వినిపించేందుకు బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం కార్పొరేటర్లు సన్నదం అవుతున్నారు. ఇప్పటికే ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలంటూ ఈనెల 10నుంచి వారంపాటు జిహెచ్ఎంసి అభ్యంతరాలు స్వీకరిస్తోంది. అన్ని సర్కిల్, జోనల్ కార్యాలయాలతోపాటు, ప్రధాన కార్యలయంలోనూ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది.ఇందులో వచ్చిన అభ్యంతరాలపై కౌన్సిల్ సమావేశంలో సభ్యుల అభిప్రాయాలను తీసుకుని డీలిమిటేషన్‌కు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ముఖ్యంగా వార్డుల విభజనపై కౌన్సిల్ లో బలంగా గళం విన్పించేందుకు బీజేపీ కార్పొరేర్లు సిద్దమవుతున్నట్లు తెలుస్తుంది. కేవలం ఎంఐఎంకు ప్రయోజనాన్ని చేకూర్చేలా విభజన జరుగుతుందని ఆరోపిస్తున్న నేతలు ఇదే అంశంపై కౌన్సిల్ సమావేశంలో నిరసనలు చేపట్టేందుకు వ్యూహం సిద్దం చేస్తున్నట్లు సమాచారం. ఈమేరకు సోమవారం బిజెపి కార్పొరేటర్లతో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు సమావేశమయ్యారు.జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనపై కార్పొరేటర్లతో చర్చించారు. కౌన్సిల్‌లో బీజేపీ వ్యవహరించాల్సిన తీరుపై పలుసూచనలు చేశారు. అలాగే మాజీ మంత్రి తలసాని ఆధ్వర్యంలో బిఆర్ఎస్,కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు సమావేశామై కౌన్సిల్‌లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించారు. అలాగే కాంగ్రెస్ సైతం ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు ఎదుర్కొనేందుకు ఎలాంటి వ్యూహాన్ని అమలు చేయాలనేదానిపై మేయర్ ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

హైదరాబాద్ వార్త



# విభజన...రగడ

- జిహెచ్ఎంసి డీలిమిటేషన్‌పై అభ్యంతరాలు
- ప్రధాన కార్యాలయానికి క్యూకట్టిన పార్టీల నేతలు
- తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని వినతులు
- మేయర్, కమిషనర్‌తో కాంగ్రెస్ నేతల భేటీ
- కమిషనర్‌ను కలిసి తమ అభ్యంతరాలు తెలిపిన బిఆర్ఎస్



మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దానం, అరికెపూడి, శ్రీగణేష్ తదితరులు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని, కాలేరు, ముఠాగోపాల్,ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ తదితరులు




**హైదరాబాద్, డిసెంబరు 15,ప్రభాతవార్త:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్( జిహెచ్ఎంసి)లో వార్డుల డీలిమిటేషన్ పై ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి భారీ ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గత వారం రోజులుగా దాదాసే 2వేల అభ్యంతరాలు వచ్చినట్లు తెలుస్తుంది. జీహెచ్ఎంసీ పరిధిలో వార్డులు పెంచుతూ ప్రాథమిక నోటిఫికేషన్ రిలీజ్ అయిన తర్వాత ఈ అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. అయితే డీలిమిటేషన్ ప్రక్రియ అశాస్త్రీయంగా జరిగిందని, జనాభా ప్రమాణాలు, భౌగోలిక సౌలభ్యం,కమ్యూనిటీ సరిహద్దులను పరిగణలోకి తీసుకోలేదని దీని వల్ల కొన్ని ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందని వివిధ పార్టీల నేతలు ఫిర్యాదు చేస్తున్నారు. వార్డుల విభజన ఇష్టానుసారంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో మంగళవారం జరిగే ప్రత్యేక కౌన్సిల్ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది.వార్డుల విభజనపై అధికారులను నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సిద్దంగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే జిహెచ్ఎంసి అధికారులు ఇప్పటి వరకు వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నామని, తుది నిర్ణయం తీసుకునేముందు వాటిని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తామని తెలుపుతున్నారు. అలాగే వార్డుల విభజనపై తమ అభ్యంత రాలను వ్యక్తంచేస్తూ సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కార్పొరేటర్లతో మేయర్ గద్వాల విజయలక్ష్మి సమావేశం అయ్యారు. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా చేయాలంటూ వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వార్డుల విభజనపై తమకు కన్ఫ్యూజన్ ఉందని డీ లిమిటేషన్‌పై అభ్యంతరం తెలపడానికి కమిషనర్‌ను కలిశామని వెల్లడించారు. కనీసం తమకు సమాచారం లేకుండానే, ఎమ్మెల్యేల అభిప్రాయం లేకుండానే డీ లిమిటేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజనపై కార్పొరేటర్లలో ఆవేదన ఉందని తమ అభ్యంతరాలు మేయర్, కమిషనర్‌కి లిఖిత పూర్వకంగా ఇచ్చామని వివరించారు. అలాగే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నేతలు జీహెచ్ఎంసీ కమిషనర్‌కి వినతిపత్రం ఇచ్చారు. డివిజన్ల పునర్విభజనలోని తప్పిదాలను సరిచేయాలని ఆ పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ డివిజన్ల విభజన గందరగోళంగా ఉందని డివిజన్ల పునర్విభజనలో తొందరపాటు ఎందుకని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా డివిజన్లు విభజించడం తప్పని దీనిపై ప్రభుత్వం పునారాలోచించాలని కోరారు.

### పేర్లు,హద్దులపైనే ఎక్కువ ఫిర్యాదులు...

ఇటీవల నగర శివారు 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసిన సర్కార్..వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచింది. అందులో ముఖ్యంగా వార్డుల పేర్లపేనే ఫిర్యాదులు అందుతున్నాయి. తాజాగా కవాడిగూడలో ఉన్న దోమల గూడ డివిజన్ ప్రత్యేక డివిజన్ చేయాలంటూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ శ్రేణులు జీహెచ్ఎంసీ వద్ద ఆందోళన చేశారు. 80 శాతం జనాభా కలిగిన డివజన్ పేరు తీసేయడం సరైన పద్ధతి కాదని తెలి పారు. ఇప్పటికైనా తమ డివిజన్ పేరు మార్చాలనిఆందోళనకు దిగిన అఖిలపక్ష నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అలాగే చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని లలితాబాగ్ డివిజన్, యాకుత్‌పుర నియోజకవర్గంలోని హరిబౌలి, చార్మినార్ నియోజకవర్గంలోని డివిజన్ల హద్దులు, పేర్లను మార్చాలంటూ ఎంఐఎం నేతల నుంచి ఫిర్యాదులందాయి. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట, ఎల్బీనగర్‌లోని హైకోర్టుకాలనీ, ఉప్పల్‌లోని చక్రిపురం కాలనీల పేర్లను మార్చాలని నేతలు కోరుతున్నారు. అలాగే అంబర్‌పేట్‌లోని పటేల్‌నగర్, డిడికాలనీ కాగా వార్డుల సంఖ్య పెంపుతో సులభంగా పాలన జరగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. విభజన ద్వారా వార్డు పరిధి చిన్నదవుతుందని దీంతో కార్పొరేటర్లు తమ వార్డులోని సమస్యలను సులభంగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ఏర్పడుతుంది. కాగా వార్డుల డీలిమిటేషన్ ద్వారా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 300 మంది కార్పొరేటర్లు ఎన్నికవుతారు. ప్రతి కార్పొరేటర్ తమ వార్డు అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించి.. నీరు, రోడ్లు, పారిశుద్ధం వంటి ప్రాథమిక వసతుల విషయంలో మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు తెలుపుతున్నారు.

## హైడ్రాతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

**-ఖాళీ స్థలాల్లో పార్కులు అభివృద్ధి చేయండి**

**-హైడ్రా ప్రజావాణికి 46 ఫిర్యాదులు**



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, డిసెంబరు 15,ప్రభాతవార్త:**

చెరువులు,నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడి.. పర్యావరణానికి ఊతమివ్వడం హైడ్రాతోనే సాధ్యమని పలువురు పేర్కొన్నారు. చెరువులు, నాలాలను పరిరక్షించి అనుసంధానం చేయాలని అప్పుడే వరదలు లేని నగరం చూడగలమన్నారు. ఈ క్రమంలో చెరువులను పరిరక్షిస్తున్న హైడ్రా..పార్కులను కూడా చేపట్టాలని కోరారు. నివాసాల మధ్య కొద్ది మొత్తంలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు కంచె వేసి.. పార్కులుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 46 ఫిర్యాదులందాయి. ఈఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలోని కండ్లకోయ విలేజ్‌లో కోర్టు భవనం, ట్రాఫిక్ పోలీసు స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి ఉద్దేశించిన ప్రభుత్వ భూమి ఇప్పుడు డంపింగ్ యార్డుగా మారిపోయింది. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ వాళ్లే అక్కడ చెత్త వేసి తగులబెడుతున్నారని దీంతో చుట్టుపక్కల ఉన్న కాలనీ, అపార్టుమెంట్ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని ఆసుపత్రుల నిర్వాహకులకు కూడా వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారు. మా ప్రాంతాలన్నీ బోరు నీటి మీదే ఆధారపడాల్సి ఉంది. భూగర్భజలాలు కలుషితమవ్వడమే కాకుండా.. దుర్గంధం, పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్దేశించిన స్థలాన్ని కాపాడి. అక్కడ మంచి వాతావరణం ఏర్పడేలా చూడాలని స్థానికులు ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. అలాగే రామంతాపూర్ పెద్ద చెరువులో తమ ప్లాట్లు మునిగిపోయాయని తమకు భూమికి భూమి లేదా.. తగిన విధంగా నష్ట పరిహారం ఇప్పించాలని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం కురుములగూడ జన్నారం కాలనీలో రాజీవ్ గృహకల్ప పేరుతో 16 బ్లాకులు నిర్మించారు. వందలాది ప్లాట్లు ఉన్నాయని ఇక్కడ కిందన ఉన్న వారు.. అపార్టుమెంట్ల ముందు, వెనుక పార్కింగ్ కోసం ఉద్దేశించిన స్థలాలను కలిపేసుకుని కొన్ని చోట్ల దుకాణాలు నిర్మించుకోగా.. మరి కొంతమంది అదనంగా గదులు నిర్మించుకుని కిరాయిలకు ఇచ్చుకుంటున్నారని.. దీంతో తమకు పార్కింగ్ సౌకర్యం లేకుండా పోవడమే కాకుండా.. రాకపోకలకు కూడా ఇబ్బందిగా పరిణమించిందని వాపోయారు. వెంటనే ఆ స్థలాలను ఖాళీ చేయించాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అమీన్‌పూర్ పెద్ద చెరువు నుంచి బందం కొమ్ము చెరువుకు వెళ్లే వరద కాలువ కబ్జాలకు గురౌతోందని అక్కడి స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కిందన నిర్మాణాలు చేపట్టిన రియల్ ఎస్టేట్ సంస్థలు నాలాను ఆక్రమించి పనులు చేపడుతున్నారని ఈ కబ్జాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు కొనసాగుతుండగా.. వివిధ సంస్థలు అనుమతులు ఇచ్చాయని..ఒకసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలా ఆక్రమణలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈనాలా ఆక్రమణతో తమ ప్రాంతాల్లో వరద నీరు నిలుస్తోందని వాపోయారు.

## 20లోగా ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి

**-వ్యాపార సంస్థలకు జిహెచ్ఎంసి సూచన**

**హైదరాబాద్, డిసెంబర్ 15,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థలు 2026 సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సులను ఈనెల 20లోపు రెన్యువల్ చేసుకోవాలని జిహెచ్ఎంసి కోరింది.ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నిర్ణయించిన గడువు లోపు రెన్యువల్ చేస్తే ఎటువంటి పెనాల్టీ ఉండదని స్పష్టం చేసింది. కాగా జిపెచ్ఎంసి ఆమోదించిన రీన్యువల్ పెనాల్టీ వివరాలు ఇలా ఉన్నాయి. డిసెంబర్ 20 లోపు - పెనాల్టీ లేదు, డిసెంబర్ 21, 2025 నుంచి ఫిబ్రవరి 19, 2026 వరకు - 25శాతం పెనాల్టీ, ఫిబ్రవరి 20 తర్వాత 50శాతం పెనాల్టీతో చెల్సించాల్సి ఉంటుందని తెలిపింది. కావున రెన్యువల్ కు చివరి తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో పెనాల్టీలు తప్పించుకోవాలంటే వ్యాపారులు ముందుగానే రీన్యువల్ పూర్తి చేసుకోవాలని సూచించింది.

## నగరంలో యువకుడి దారుణ హత్య

**మెహిదీపట్నం, డిసెంబర్ 15, ప్రభాతవార్త :**

హైదరాబాద్ నగరం ఇప్పు డు ఒకప్పటి రాయలసీమను తలపిస్తుంది, పగలు ప్రతీకారులతో రగిలిపోతుంది, హైదరాబాద్ మహా నగరంలో ఆదివారం అర్ధరాత్రి మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో పారామౌంట్ కాలనీలో ఇర్ఫాన్ (24) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఇన్ స్పెక్టర్ రమేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిలాల్ అనే వ్యక్తి ఇర్ఫాన్ ని కత్తితో పొడిచి హత్య చేశాడు. హంతకుడు బిలాల్ భార్యకి మృతుడు ఇర్ఫాన్ అన్న అద్నాన్ కి మధ్య అక్రమ సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు తెలుస్తుంది. బిలాల్, అద్నాన్ మధ్య గొడవ జరుగుతుందన్న సమాచారంతో ఇర్ఫాన్ గొడవ జరుగుతున్న స్థలానికి చేరుకున్నాడు. ఈ ఘర్షణలో మాట మాట పెరిగి ఇర్ఫాన్ పై బిలాల్ కత్తితో దాడి చేశాయి. ఇర్ఫాన్ ని హాస్పిటల్ కి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. హంతకుడు బిలాల్ ని అదుపులోకి తీసుకొని పోలీసులు విచా రిస్తున్నారు. హంతకుడు బిలాల్ భార్యకి, మృతుడి తమ్ముడు అదన్‌కి అఫైర్ నడుస్తోంది. బిలాల్ అదన్ ని పిలిచి మాట్లాడుతుండగా గొడవ మొదలైంది. దీంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అదన్ పై దాడి జరుగుతుండగా సమాచారం అందుకున్న ఇర్ఫాన్ సంఘటన స్థలానికి చేరుకున్న బిలాల్ ఇర్ఫాన్ పై దాడి చేశాడు. ఈ దాడుల్లో ఇర్ఫాన్ చనిపోగా అదన్ తీవ్రగాయా ల పాలయ్యాడు. ఇర్ఫాన్ తన తమ్ముడు అదన్ హంతకుడు బిలాల్ మధ్య గొడవ జరుగుతుందని తెలిసి గొడవని ఆపటానికి వచ్చాడు. గొడవ ఆపే నేపథ్యం లో బిలాల్ ఇర్ఫాన్ పై కత్తితో దాడి చేయటంతో కత్తి ఇర్ఫాన్ ఛాతిలో దిగింది. ఇర్ఫాన్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా.. దారిలోనే మృతి చెందాడు. ఆలివ్ హాస్పిటల్ వైద్యులు ఇర్ఫాన్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న టోలీచౌకీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బిలాల్ ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి గొడవకి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు.

## వామ్మో.. కుల్సుంపురా పోలీసుస్టేషన్!

**-అవినీతి ఆరోపణలతో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సస్పెండ్**

**-ఎసిపి స్థాయి అధికారిని హెడ్‌క్వార్టర్స్ అటాచ్**

**గోషామహల్, డిసెంబరు 15ప్రభాతవార్త:**

వామ్మో కుల్సుంపురా పోలీస్ స్టేషన్..ఈ పేరుతో ఏర్పడిన ఎసిపి కార్యాలయం పరిధిలో విధులను నిర్వహించాలంటే జంకుతున్నారు.గతంలో ఈ పోలీ స్స్టేషన్ గోషామహల్ డివిజన్ ఉండేది.దాదాపు ఎడాదిన్నర క్రితం నుంచి కుల్సుంపురా సబ్ డివిజన్ ఎసిపి పరిధిలో కుల్సుంపురా,టప్పాచబుత్రా, గుడిమల్కాపుర్ పోలీస్‌స్టేషన్లను చేర్చారు. ఇక్కడ ఎసిపిగా మునావర్ నియమించారు.కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ కె. సునీల్,టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా అభిలాష్‌ను నియమించారు. అయితే సోషల్ మీడియాకు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ వేదికైంది. కేసులు పెట్టాలని ఒకరు,కేసులు పెట్టవద్దంటూ మరికొందరూ లాబీలు నడిపించినట్లు తెలిసిందే.ఈ విషయంలో ఎసిపి,ఇన్‌స్పెక్టర్ మధ్య అంతర్గత విభేదాలు వచ్చాయి.చీలికి,చీలికి ఇద్దరు అధికారుల మధ్య నువ్వు ఎంత,నువ్వు ఎంత అనేలా వాధించుకున్నారు. ఈ విషయం పై స్థాయి వరకు వెళ్లడంతో ఇన్‌స్పెక్టర్ కె.సునీ ల్‌ను సస్పెండ్ చేశారు.ఈ నేపథ్యంలో రెండునెలల క్రితం టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ అభిలాష్‌ను కూడా సస్పెండ్ చేయడం గమనార్హం.ఒకే ఎసిపి పరిధిలోని ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సునీల్, అబిలాష్‌ను సస్పెండ్ చేయడం పట్ల ఆయా స్టేషన్‌లలో విధులను నిర్వహించే ఎస్ఐలు, ఇతర సిబ్బంది ఏ రోజు ఎవరిని సస్పెండ్ చేస్తారో ఆందోళనకు లోనయ్యారు. నగర పోలీస్ కమీషనర్ వి.సి సజ్జనార్ కుల్సుంపురా అసిస్టెంట్ కమీషనర్‌గా కొనసాగుతున్న మునావర్‌పై పలు ఆరోణలతో హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అలాగే ఎసిపి మునావర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అంతర్గత విచారణకు కమీషనర్ ఆదేశించా రు. తన మాట వినని ఇన్‌స్పెక్టర్లును టార్గెట్ చేసి వారిపై తప్పుడు నివేదికలు పంపించి పోలీ సు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లునివేధిక ద్వారా తెలుసుకున్న కమీషనర్ వి.సి సజ్జనార్, మునావర్ వ్యవహారంపై అగ్రహం వ్యక్తం చేసి మునావర్‌ను పోలీస్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం.శాంతిభద్రతలను కాపాడే పోలీసులే వివాదాలు, ఆరోపణలకు గురి కావడం పట్ల ప్రజలు చర్చించుకుంటున్నారు.దీంతో ఇక్కడ విధులను నిర్వహించాలంటే పోలీ సులు జంకుతునే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పోలీసుస్టేషన్‌లో విధులను నిర్వహించాలంటే కత్తిమీద సాములాగా ఉంటుందని ఇక్కడ విధులను నిర్వహించి బదిలీపై వెళ్లిన పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

## ఈసారి న్యూఇయర్ వేడుకలకు కఠిన రూల్స్!

**-పాటించకపోతే జైలుకే.. కీలక మార్గదర్శకాలు జారీ**

**హైదరాబాద్, డిసెంబరు 15 ప్రభాతవార్త**

మరికొద్దిరోజుల్లో న్యూ ఇయర్ వస్తుండటంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ముందు జాగ్రత్తగా కఠిన నిబంధనలు విడుదల చేశారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా వేడుకలు జరిగేలా చర్యలు చేపట్టనున్నారు. తాజాగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. అవేంటో చూద్దాం. మరో 14 రోజుల్లో 2025 ముగిసి కొత్త ఏడాది 2026 రానుంది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టేందుకు యావత్ ప్రపంచం రెడీ అవుతుంది. ఇక తెలుగు రాష్ట్రాల ప్రజలు కూడా నూతన ఏడాదికి వెల్‌కమ్ చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో ఎలా సెలబ్రేట్ చేసుకోవాలనే దానిపై ఇప్పటి నుంచే ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇక హైదరాబాద్‌లో డిసెంబర్ 31 రాత్రి ఎంత సందడి ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పబ్స్, హోటల్స్, రెస్టారెంట్, క్లబ్స్‌లో గ్రాండ్‌గా ఈవెంట్స్ జరుగుతుంటాయి. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు ఇప్పటికే న్యూఇయర్ వేడుకలకు వేదికలు సిద్ధం చేస్తున్నాయి. వీటికి ఎంట్రీ టికెట్లను కూడా విడుదల చేస్తున్నాయి. న్యూ ఇయర్ వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు హైదరాబాద్ పోలీసులు కఠిన నిబంధనలు జారీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఈ మార్గదర్శకాలను విడుదల చేశారు.

**ఒంటి గంట వరకు సెలబ్రేషన్స్**

ఈ మార్గదర్శకాల ప్రకారం పబ్‌లు, బార్లు, క్లబ్‌లు, హోటల్స్, రెస్టారెంట్స్ డిసెంబర్ 31 అర్ధ రాత్రి 1 గంటల వరకు సెలబ్రేషన్స్ జరుపుకోవచ్చు. ఈ వేడుకలకు మైనర్లను అసలు అనుమతించకూడదు. అలాగే ఈవెంట్ జరిగే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి. అశ్లీల ప్రదర్శనలు ఈవెంట్లలో చేయకూడదు. న్యూ ఇయర్ వేడుకలు జరిపే యాజమాన్యాలు 15 రోజుల ముందే పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలి.

**బహిరంగంగా సౌండ్ సిస్టమ్స్ బంద్.**

ఇక రోడ్లపై బహిరంగంగా సౌండ్ సిస్టమ్స్ పెట్టడంపై నిషేధం విధించారు. హోటల్స్, బాంక్వెట్ హాల్స్, కమ్యూనిటీ హాల్స్‌లో ఇండర్‌లోనే సౌండ్ సిస్టమ్‌కు రాత్రి 1 గంటల వరకు అనుమతి ఉంటుంది. రాత్రి 10 గంటల తర్వాత 45 డెసిబెల్స్ మించకుండా సౌండ్ పెట్టుకోవాలి. ఇక ఈవెంట్లలో ఆయుధాలకు అనుమతి ఉండదు. ఇక ఈవెంట్ సామర్థం కంటే ఎక్కువ పాసులు, టికెట్లు జారీ చేయకూడదు. ఇక వేడుకల్లో మత్తు పదార్థారాలు వాడకూడదు. మద్యం తాగిన కస్టమర్లకు ఈవెంట్ నిర్వహకులు మద్యం సేవించని డ్రైవర్లను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం నిర్దేశించిన టైమ్ ప్రకారం కస్టమర్లకు మద్యం అందించాలి.

**కఠిన చర్యలు**

ఈ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసులు హెచ్చరించారు. మద్యం తాగి డ్రైవ్ చేస్తే రూ.10 వేల పెనాల్టీ లేదా ఆరు నెలల జైలుశిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. ఇక ఈవెంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక రోడ్లపై అల్లరి చేసేవారికి కూడా చర్యలు తీసుకుంటామని, ప్రశాంతంగా వేడుకలు జరిగేలా అందరూ సహకరించాలని పోలీసులు కోరారు.

## బాలికను నమ్మించి.. గర్భం తొలగించి..

**- ఆత్మహత్యయత్నానికి పాల్పడిన బాలిక**

**జూబ్లీహిల్స్, డిసెంబరు 15, ప్రభాతవార్త:**

మైనర్ బాలికను నమ్మించి అత్యాచారం చేసిన నిందితుడితోపాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఒక మైనర్ బాలిక తల్లి చనిపోయి, తండ్రి పట్టించుకోకపోవడంతో తాత వద్ద ఉంటుంది. ఇదే సమయంలో బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మహేష్ అనే యువకడి మాటలను నమ్మి గుంటూరుకు వెళ్లిపోయింది. దీంతో మహేష్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో అతనికి పరిచయం ఉన్న శ్రీలక్ష్మి, శ్రీకాంత్ అనే ఇద్దరు బాలికకు గర్భవిచ్ఛిత్తి మాత్రలను ఇచ్చారు. దీంతో బాలికకు రక్తస్రావమై తీవ్ర అనారోగ్యం బారిన పడింది. ఈ నెల 7న బాలికను తిరిగి తాత ఇంటి వద్ద వదిలి విషయం ఎవరికి చెప్పవద్దంటూ బెదిరించి వెళ్లిపోయారు. కాగా ఇంట్లో ఉన్న బాలిక తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనై బొద్దింకలను చంపే పౌడర్ మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన తాత ఇరుగు పొరుగు సాయంతో బాలికను ఆసుపత్రికి తరలించారు.

బాలిక ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమోదు చేసి మదురా నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసుల మహేష్‌బాబు, శ్రీలక్ష్మి, శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ పార్కింగ్....అవస్థలు పడుతున్న విద్యార్థులు

**-పార్కింగ్ తొలగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి**



,శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ముందు పార్కింగ్ చేసిన బైకులు,ఆటోలు.

**బేగంపేట డిశంబరు 15,ప్రభాతవార్త**

బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల (జీరా) ముందు స్థానికంగా ఉండే వారు కొందరు తమ ద్విచక్రవాహనాలను,ఆటోలను పాఠశాల ముందు పార్కింగ్ చేస్తుండటంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.ప్రతి రోజు ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పాఠశాల గేటుకు అడ్డంగా ఉంటున్న వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పాఠశాల ముందు గల్లీలో నివాసం ఉండే కొందరు తమ వాహనాలను పాఠశాల ముందు పార్కింగ్ చేసి వెళుతుండటంతో పాఠశాలకు విద్యార్థులను తీసుకు వచ్చే తల్లి దండ్రులు,ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.గల్లీ చిన్నగా ఉండటం,పాఠశాల ముందు రోడ్డు ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ఈ సమస్య తలెత్తుతుందని,స్థానికంగా ఉండే వారు ఈ ప్రాంతంలో అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం,వాటిని కిరాయిలకు ఇస్తుండటంతో వారికి పార్కింగ్ లేకుండా పోతుండటంతో అక్కడ నివసించే వారంతా తమ వాహనాలను పాఠశాల ముందు రోడ్డుపైన నిర్లక్ష్యంగా పార్కింగ్ చేసి వెళుతున్నారని,దీంతో ఈ గల్లీలో ప్రయాణం సాగించాలంటే నరక ప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని శ్యాంలాల్ బిల్డింగ్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ముందు ఉన్న అక్రమ పార్కింగ్‌ను నివారించాలని స్థానికులు,విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మానవీయ గురుశిష్యబంధ ప్రతిరూపం ప్రశ్నోత్తర రత్నమాలిక గ్రంథం : కె.వి.రమణాచారి



గ్రంథావిష్కరణ కావిస్తున్న రమణాచారి, వెంకటరెడ్డి, నరసింహాచార్య రామాచార్యులు తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 15 ప్రభాతవార్త :**

మానవీయ విలువలు, గురుశిష్య బంధాలకు ప్రతిరూపం ప్రశ్నోత్తర రత్నమాలిక గ్రంథమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డా. బి.రామాచార్యులు ఆత్మానుదర్శనం వ్యాఖ్యానంతో రచించిన ఆదిశంకరాచార్య ప్రశ్నోత్తర రత్నమాలిక గ్రంథాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి విశిష్ట అతిథులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డా. వెనిగళ్ళ రాంబాబు, సంస్థ అధ్యక్షుడు సాధన నరసింహాచార్య, కార్యదర్శి శంభునికుమార్, సంయోజకుడు నరేంద్రకృష్ణ తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. సాధన సాహితీ స్రవంతి, హైదరాబాద్ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమణాచారి మాట్లాడుతూ ఆదిశంకరుల జీవితం ప్రతీఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ గ్రంథం యువతకు దిక్సూచిగా నిలుస్తుందని, ప్రశ్నించడం ద్వారా జ్ఞానాన్ని అందించడం జరుగుతుందని, దానికి తగ్గ సమాధానం కూడా శంకరాచార్యులవారు ఇచ్చారని, ఆ సంస్కృత శ్లోకాలను రామాచార్యులు తెలుగులోకి అనువదించారని ప్రశంసించారు. కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షోపన్యాసంలో ఉత్తమ గురువు, ఉన్నత శిష్యుల అనుబంధం, జ్ఞాన తృష్ణ తెలుసుకోవడానికి ఈ గ్రంథం తోడ్పడుతుందని స్పష్టం చేశారు. చివరిగా డా. వెనిగళ్ళ రాంబాబు గ్రంథ పరిచయం కావించారు.

## వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు

**: చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**




చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**చార్మినార్,డిసెంబరు 15 ప్రభాతవార్త :**

చౌక్ మైదాన్ చార్మినార్ శ్రీ బాలాజీ మందిరంలో 30వ తేదీన అత్యంత వైభవంగా శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు జరగనున్నాయని,వేలాది మంది భక్తులు వైకుంఠ మహోత్సవాలలో పాల్గొంటున్నారని,అన్ని వసతులు కల్పించాలని కోరుతూ బాలాజీ మందిరం ప్రధాన అర్చకులు శృంగారంరమణాచార్యులు చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.డిసెంబరు నెల 30వ తేదీన జరగనున్న శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు జిహెచ్ఎంసి తరుపున ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్యారసాని వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ధనుర్మాస మహోత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వర వేంకటేశ్వర స్వామివార్ల దేవాలయం

**నాంపల్లి, డిసెంబరు 15 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ నిర్వహణలో గాంధీ నగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన మహాన్మిత శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయం నేడు 16మంగళవారం నుండి 2026 జనవరి 15 వరకు నెలరోజులపాటు జరిగే ధనుర్మాస మహోత్సవాలను ముస్తాబైంది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అత్యంత వైభవంగా శ్రీ పాంచరాత్రాగమానుసారంగా వైష్ణవ సంప్రదాయం ప్రకారం ధనుర్మాస (తిరుప్పావై) మహోత్సవాలు కన్నుల పండువగా జరగనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ఛైర్మన్ బి.సి.వెంకటేశ్వరరావు, ప్రధానార్చకుడు ఎం.చంద్రశేఖరశర్మలు తెలిపారు. ఈ సందర్భంగా ధనుర్మాస విశేష కైంకర్యాల(పూజలు) వివరాలు వారు వెల్లడించారు. డిసెంబరు 16 మంగళవారం సాయంత్రం 5గంటలకు తిరుప్పావై ప్రబంధ సేవాకాలం ప్రారంభం, ప్రథమ పాశురం ప్రారంభం; 23 మంగళవారం ఉదయం 9.30లకు శ్రవణా నక్షత్రం శ్రీవారి కళ్యాణం; 26 శుక్రవారం ఉదయం 9లకు లక్ష తులసీ అర్చన; 30 మంగళవారం ఉదయం 3లకు వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) ఉదయం 3గంటల నుండి శ్రీవారి అభిషేకం, తదుపరి అలంకారం, విశేష పుష్పాలంకరణ, వైకుంఠ రంగనాథుడి అలంకారం, ఉత్తరద్వార దర్శనం, వెండి పుష్పార్చన; 2026 జనవరి 8 గురువారం రాత్రి 7లకు దీపోత్సవం; 11 ఆదివారం ఉదయం 7లకు కూడారై ఉత్సవం; 14 బుధవారం ఉదయం 10లకు గోదాకళ్యాణ మహోత్సవంలతోపాటు ప్రతీరోజూ సాయంత్రం 5గంటల నుండి విష్ణు సహస్రనామ పారాయణం తదితర పూజాది కార్యక్రమాలుంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వేంకటేశ్వరస్వామివారి కృపకు పాత్రులు కావాలని,ధనుర్మాస మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఈవెంట్ ఆర్గనైజర్లు, పబ్‌ల నిర్వాహకులతో మాదాపూర్ డిసిపి సమావేశం

**-నూతన సంవత్సర వేడుకలపై సూచనలు**

**గచ్చిబౌలి, డిసెంబరు 15 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న మాదాపూర్ డిసిపి రితిరాజ్ తదితరులు

నూతన సంవత్సవ వేడుకలు సమీపిసు_న్న తరుణంలో సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని మాదాపూర్ జోన్‌లో వేడుకల నిర్వహణపై మాదాపూర్ డిసిపి రితిరాజ్ పలు సూచనలు చేశారు. ఈ మేరకు మాదాపూర్ జోన్ పరిధిలోని పోలీసు అధికారులు, ఈవెంట్ ఆర్గనైజర్లు, పబ్‌ల నిర్వాహకులతో సోమవారం గచ్చిబౌలిలోని డిసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. వేడుకలు నిర్వహించే నిర్వాహకులు ఈనెల 21వ తేదీలోపు సిపిపిఎంఎస్ పోర్టల్‌లో పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు వేడుకల్లో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబరాబాద్ పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని హెచ్చరించారు. వేడుకలు నిర్వహించే ఈవెంట్ ఆర్గనైజర్లు, పబ్‌ల నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అనుమతి మేరకే సౌండ్ సిస్టం వాడాలని, సౌండ్ పొల్యూషన్ లేకుండా చూసుకోవాలని తెలిపారు. దీంతో పాటు కేపాసిటీకి మించి పాసులు జారీ చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వేడుకలు నిర్వహించే ప్రాంతంలో సరైన పార్కింగ్ వసతి ఉండే విధంగా చూసుకోవాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల ఏసిపిలు, వివిధ పోలీస్ స్టేషన్ల ఇన్స్‌పెక్టర్లు, అధికారులు, ఈవెంట్ ఆర్గనైజర్లు, పబ్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## గోపన్‌పల్లి రంగనాథుడి మాన్యం భూమిలో రహదారి బంద్

**రోడ్డును ధ్వంసం చేసి బోర్డులు ఏర్పాటు**

**గచ్చిబౌలి, డిసెంబరు 15 ప్రభాతవార్త**




దేవుడి మాన్యం భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

గోపన్‌పల్లిలోని పురాతన రంగనాథస్వామి దేవాలయం మాన్యం భూములను ఆక్రమంచి అక్రమంగా ఏర్పాటు చేసిన రహదారిని దేవాదాయ శాఖ అధికారులు సోమవారం బందు చేశారు. ఈమేరకు ప్రైవేటు నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన రహదారిని ద్వంసం చేసి సదరు భూమి రంగనాథస్వామి దేవాలయ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. జెసిబిలతో రహదారిని ద్వంసం చేయడంతో పాటు రాకపోకలు సాగకుండా కందకాలు తవ్వారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో దాదాపు 500 సంవత్సరాల పురాతన రంగనాథ స్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయం మాన్యం కింద గోపన్‌పల్లి వ్యాప్తంగా ఎకరాల కొద్దీ భూములు ఉండగా, గోపన్‌పల్లి సర్వే నెంబరు 268లో సైతం 13.18 ఎకరాల దేవుని మాన్యం భూమి ఉంది. కాగా ఈ భూమికి ఆనుకొని ఉస్మాన్ నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో వెలుస్తున ్న భారీ బహుళ అంతస్థుల నిర్మాణాల చూపు పడింది. తమ నిర్మాణాలకు దగ్గరి దారి కోసం దేవుని మాన్యం భూములను ఆక్రమించి రహదారి నిర్మాణం చేపడుతున్నారు. గతంలో సిసి రోడ్డు వేయగా, దేవాదాయ శాఖ అధికారులు తొలగించారు. తాజాగా మరోసారి మట్టి దారిని ఏర్పాటు చేసి రాకపోకలు చేపట్టారు. ఈ విషయాన్ని అధికారుల ద ృష్టికి తీసుకువస్తూ ప్రభాతవార్త డిసెంబరు 8వ తేదీన రంగనాథ దేవుని మాన్యం భూములు అన్యాక్రాంతం పేరుతో కథనం ప్రచురించింది. దీనిపై దేవాదాయ శాఖ అధికారులు స్పందించి రహదారిని గతంలోనే పరిశీలించారు. నిర్మాణ సంస్థలకు కొంత సమయం ఇచ్చి ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తేల్చిచెప్పారు. ఇందులో భాగంగా సోమవారం దేవాదాయ శాఖ ఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి దేవాదాయ శాఖ అధికారులు జెసిబిలతో అ క్రమ రహదారిని ద్వంసం చేశారు. సదురు దారిలో రాకపోకలు సాగకుండా కందకాలు తవ్వడంతో పాటు సదరు భూమి రంగనాథ స్వామి దేవుని మాన్యం అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ రంగనాథస్వామి దేవుని మాన్యం భూముల ఆక్రమణకు పాల్పడితే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు భాషాభివృద్ధికి ఉద్యమించిన మాడపాటి హనుమంతరావు



ప్రసంగిస్తున్న కొల్లేటి దామోదర్ గుప్తా, చిత్రంలో గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి తదితరులున్నారు

**చిక్కడపల్లి డిసెంబర్ 15,ప్రభాతవార్త :** నిజాం పాలన లో తెలుగు భాషా భివృద్ధికి ఉద్యమించిన ప్రముఖులలో మాడపాటి హనుమంతరావు ముఖ్యుడు అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. ఆంధ్ర మహ సభ ఏర్పాటు కు కృషి చేసి జాతీయ ఉద్యమం లో పాల్గొని తదుపరి హైదరాబాద్ కార్పొరేషన్ తొలి మేయర్ గా రాష్ట్ర శాసన మండలి తొలి చైర్మన్ గా నిరంతరం ప్రజా సంక్షేమం కోసం ఆలోచించిన మహా నాయకులు మాడపాటి హనుమంతరావు అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గానసభ నిర్వహణ లో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా మాడపాటి హనుమంత రావు యాది లో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ మాట్లాడుతూ మాడపాటి సామాజిక కృషికి గుర్తింపు గా కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మ భూషణ్ పురస్కారం తో గౌరవించింది అని గుర్తు చేశారు బాలికల విద్య ను ప్రోత్స హించే నిమిత్తం విద్యా సంస్థ ఏర్పాటు చేశారు అని అదే నారాయణ గూడ లోని మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల అని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్ బి రామ్, గాన సభ సభ్యులు భమిడిపాటి ఉష శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ నేత కోదాటి నారాయణ రావు

**చిక్కడపల్లి డిసెంబర్ 15 (ప్రభాతవార్త :**



గ్రంథాలయ ఉద్యమ నేత కోదాటి నారాయణ రావు స్ఫూర్తితో ప్రతి ఒక్కరు గ్రంథాలయాల పురోభివృద్ధికి కృషి చేయాలని నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ, కోదాటి నారాయణ రావు కుమారుడు కోదాటి యుగంధర్ అన్నారు. సోమవారం అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆవరణంలో గ్రంథాలయ ఉద్యమ నేత కోదాటి నారాయణ రావు 112వ జయంతి సభ కామన్ దయాస్ సంస్థ అధ్యక్షులు తంగెళ్లపల్లి కనకా చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోదాటి నారాయణ కుమారుడు కోదాటి యుగంధర్, గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగి వై.విజయలక్ష్మి( కోదాటి కోడలు)లను ఘనంగా సత్కరించారు. బీ ఆర్ ఎస్ యువనేత ముఠా జయసింహా , సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, , గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగి బుచ్చయ్య శేఖర్ గుప్త, గ్రంథాలయ ఉద్యోగులు ఎం. సుబ్బ లక్ష్మి సీతామహాలక్ష్మి అవినాష్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు. కోదాటి యుగంధర్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమం లోనూ గ్రంథాలయ ఉద్యమం లోనూ కోదాటి నారాయణ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ ఉద్యోగులను, జర్నలిస్టు లను, గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తున్న విద్యార్థులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. పది మంది కవులు కవితా గానం చేశారు. ప్రశాంతి, ప్రవల్లిక, రేణుక, రాజేష్ ఉద్యోగు లను, పాత్రికేయులు చిలుకూరి అఖిలేష్, గుడి గణేష్, జయ సూర్య లను సత్కరించారు.ఈటల సమ్మన్న, వలబోజు బోనాల ప్రకాష్ బసవోజు బొలిమంత వెంకట రమణ విజయ భారతి ,సురేష్, ఆంజనేయులు కవులను సత్కరించారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**చిక్కడపల్లి డిసెంబర్ 15 (ప్రభాతవార్త ) :** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. స్థానిక కళాశాల ప్రాంగణంలో ఎంబిఏ జూనియర్ల కోసం సీనియర్ ఎంబిఏ విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ , స్టూడెంట్ కౌన్సెలర్ మిటికా క్రమశిక్షణపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. ఈ వేడుక పాటలు, నృత్యం , బీట్‌బాక్సింగ్ వంటి ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలతో నిండిపోయింది. మిస్టర్ ఫ్రెషర్, మిస్ ఫ్రెషర్ పెర్ఫార్మర్ ఆఫ్ ది డే వంటి శీర్షికలను ప్రకటించగా పాల్గొనేవారు అధ్యాపక సభ్యులను కూడా సత్కరించారు.

## వల్లభాయ్ పటేల్‌కు ఘననివాళి

**అత్తాపూర్ డిసెంబర్ 15,ప్రభాతవార్త :**



సర్దార్ వల్లభాయ్ పటేల్ 75 వ వర్ధంతి సంద ర్భంగా అత్తాపూర్ డివిజన్‌లో హైదర్ గూడా సర్దార్ పటేల్ చౌరస్తాలో పటేల్ విగ్రహానికి డివిజన్ అధ్యక్షులు సులిగె వెంకటేష్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంటు బిజెపి కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ,బిజెపి నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నిరం కుశ నిజాం మెడలు వంచి ఆనాటి భారతదేశ ఉప ప్రధాని ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ రజాకార్ల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిం చారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ పి. మల్లేష్ యాదవ్, కాడెం సుధాకర్, సత్యానారాయణ ముదిరాజ్, సాబాద విజయ్ కుమార్ , ఎస్. జ యానంద్ రెడ్డి, ఆర్. రాజశేఖర్, కే. కిరణ్ చారి, గౌరిగి రాజు రావుల జగ న్, పి. వెంకట్ రెడ్డి, కొంగళ్ల బుచ్చయ్య, కాకులారం కృష్ణ, బీట్కూరి సతీష్, లఖన్, శివరాజ్, పొట్ట అనిల్, శ్రీకాంత్ చారి బీస భరత్ లక్ష్మీకాంత్ రెడ్డి మరియు కార్యకర్తలు నాయకులు యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## వివేక్ నగర్ బస్తీ అధ్యక్షుడి మృతి

**చిక్కడపల్లి డిసెంబర్ 15 (ప్రభాతవార్త ) :** గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి లోని వివేక్ నగర్ బస్తీ వాస్తవ్యుడు,బస్తీ కమిటీ అధ్యక్షుడు జి.చెన్నయ్య సోమవారం ఆకస్మిక మృతి చెందారు. సమాచారం అందుకున్న బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ లు చెన్నయ్య పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. వివేక్ నగర్ బస్తీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి,అందరితో కలిసి వుండే స్వభావాన్ని గుర్తు చేశారు. చెన్నయ్య అకాల మరణం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, RANGA REDDY DIST AT: KUKATPALLY
O. S. No. 276 OF 2025

BETWEEN:
Kommu Bujji & others ...Plaintiffs
AND
The Tahsildar & Another ...Defendants

To,
All Concerned ...Defendant No.3

Take Notice that the plaintiffs herein above have filed the original suit No.276 of 2025 declare the plaintiffs as the legal heirs and successors of the Late. Kommu Sudhakar Rao S/o. Late. K. Chandraiah to succeeded the suit schedule property i.e., Plot No.40, H.No.6-75/1, PTIN No.1119903760, comprising ground & First floor (RCC), admeasuring 200 sq. Yards or 167.20 sft, Situated At Prashanth Nagar Colony, Serilingam pally Mandal, R.R.Dist. The above case is posted on 19/12/2025 for placing objections if any by all concerned. Therefore, if any person / persons or parties have any sort of objection or claim or interest may appear and place their objections if any, in person or through counsel on 19/12/2025 at 10:30 am before the Hon'ble SENIOR CIVIL JUDGE, RANGAREDDY DIST AT: KUKATPALLY or the else the case shall be decided on merits and evidence placed on record.

//BY COURT ORDER//

Sd/- K. RAJ KUMAR,
K. SAI KUMAR
Advocates
OFFICE: 5-50, Chandanagar
Serilingampally Mandal, R.R.Dist,
Ph: 9912159091, 9652517517

## విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం ప్రయోజనకరం : విశాల్‌కుమార్

**హైదరాబాద్ డిసెంబరు 15 ప్రభాతవార్త ;**



డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షిక క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జాతీయ మాజీ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు కె.విశాల్‌కుమార్

విద్యతోపాటు విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం చాలా ప్రయోజనకరం అని, ఇది నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం మరియు పట్టుదల స్ఫూర్తిని పెంపొందించడంలో సహాయపడుతుందని జాతీయ మాజీ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, జాతీయ కోచ్ కె.విశాల్‌కుమార్ తెలిపారు,గుండ్ల పోచంపల్లి, డిఆర్ఎస్ఐఎస్ క్యాంపస్‌లో మూడు రోజులపాటు జరిగే డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 23వ వార్షిక క్రీడా పోటీలను సోమవారం విశాల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన మార్చ్ పాస్ట్ విద్యార్థుల నుండి అయన గౌరవ వందనం స్వీకరించి, క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ప్రసంగిస్తూ క్రీడలు పిల్లలను తెలివిగా చేస్తాయని. వారి మెదడు శాస్త్రీయంగా బాగా పనిచేస్తుందని, వారు విద్యాపరంగా మెరుగ్గా రాణించడానికి సహాయపడుతుందని. కాబట్టి పిల్లలు క్రీడలు ఆడటానికి అనుమతించడంలో రాజీ పడొద్దని అన్నారు. క్రీడలు ఆడటం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా మరియు ఫిట్‌గా ఉంటారని, మంచి సమన్వయాన్ని అందించి, సృజనాత్మకంగా ఉండటం నేర్చుకుంటారని చెప్పారు. డిఆర్ఎస్ఐఎస్ డైరెక్టర్ అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ క్రీడలు మన జీవితాల్లో బహుముఖ,సమగ్ర పాత్ర పోషిస్తాయని,క్రీడా స్ఫూర్తి వంటి విలువలను కూడా పెంపొందిస్తుందని గుర్తించి డిఆర్ఎస్ వంటి ఉత్తమ అంతర్జాతీయ పాఠశాలలు అత్యాధునిక క్రీడా సామాగ్రి, సదుపాయాలను కల్పించి విద్యార్థులను క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. డిఆర్ఎస్ఐఎస్ ప్రిన్సిపాల్ ఐ.వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, సమయ నిర్వహణ మరియు అభిజ్ఞా నైపుణ్యాలను ప్రోత్సహించడం ద్వారా విద్యా పనితీరును మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ హెడ్ డా.మురమళ్ళ భరత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, హాస్టల్ హెడ్ రాజేంద్రప్రసాద్, అడ్మిన్ హెడ్ వినోద రంజన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు రోజులు.. 200ల నిఘా నేత్రాలు.. చివరికి చిక్కిన అగంతకులు

**- వజ్రాభరణాలతో కూడిన బ్యాగు స్వాధీనం**
**- వాహనం, ఇద్దరు నిందితుల అరెస్ట్**

**బంజారాహిల్స్, డిసెంబరు 15, ప్రభాతవార్తః**

ఆరు రోజులపాటు దాదాపు 200ల మేర నిఘా నేత్రాలు జల్లడపట్టి ఒక బాధితురాలు పోగొట్టుకున్న ఖరీదైన వజ్రాభరణాలతో కూడిన బ్యాగును తిరిగి అప్పగించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లో నివసించే స్వాతి అగర్వాల్ (41) ఈ కామర్స్ వస్త్ర వ్యాపారం చేస్తుంటుంది. ఈ నెల 13న బ్యాంకులో డబ్బులు జమ చేయడానికి తన వాహనంపై వెళ్తుంది. డబ్బులు, వజ్రాభరణాలతో కూడిన తన బ్యాగును కాళ్ల వద్ద పెట్టుకొని వెళ్తుండగా మినిస్టర్ క్వార్టర్స్ వద్ద రోడ్డు ఎత్తుగా ఉండడంతో ఆమె కాళ్ల దగ్గర భద్రపరిచిన హ్యాండ్బ్యాగ్ పడిపోయింది. ఈ విషయాన్ని ఆమె గమనించకుండా బ్యాంక్‌కు వెళ్లి చూసుకోగా కనిపించలేదు. అదే సమయంలో ఓ ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్న మహిళ తన బిఎండబ్ల్యూ కారులో వెళ్తుండగా ఈ బ్యాగు కిందపడటాన్ని గుర్తించింది. డ్రైవర్ కారు ఆపి ఆ బ్యాగ్‌ను వైద్యురాలికి అందించాడు. అదే సమయంలో వెనుక వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు ఈ విషయాన్ని గమనించారు. నేరుగా ఆ వైద్యురాలి వద్దకు వెళ్లి ఈ బ్యాగ్ మీదేనా? అంటూ ప్రశ్నించారు. తనది కాదని, పోలీసులకు అప్పగిస్తానని ఆమె చెప్పి కారులో ముందుకు వెళ్లింది. ఈ ఇద్దరు యువకులు అప్రమత్తమై కొద్దిదూరం ఆమెను అనుసరించి రోడ్డు నంబర్12లో ఆమె కారుకు అడ్డుగా బైక్‌ను నిలిపి బ్యాగ్ పోగొట్టుకున్న మహిళ మినిస్టర్ క్వార్టర్స్ సమీపంలో ఏడుస్తూ కూర్చుందని, తాము అప్పగిస్తామని నమ్మించి బ్యాగుతో అక్కడి నుంచి ఉడాయించారు. బాధితురాలు స్వాతి అగర్వాల్ బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించి డైమంగ్ పెండెంట్, బంగారు గాజులు, చెవి రింగులు, మూడు సెల్ఫోన్లు, 15 ఏటీఎం కార్డులు, ఇతర ధృవపత్రాలు ఉన్న తన బ్యాగు పోయిందంటూ ఫిర్యాదు చేసింది. దీంతో బంజారాహిల్స్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు బంజారాహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్, జూబ్లీహిల్స్, యూసుఫ్ గూడ ప్రాంతాల నుంచి కెమెరాలకు చిక్కకుండా సందుల్లో నుంచి దూసుకెళ్లారు. దీంతో పోలీసులు వరుసగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుంచి జూబ్లీహిల్స్ దాకా 200ల మేర కెమెరాలు వడబోశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్36లో ఈ బైక్ నంబర్ స్పష్టంగా కనిపించింది. దీంతో పోలీసులు బోరబండలో నిందితులను పట్టుకున్నారు.

నిందితుల్లో సయ్యద్ పర్వాన్ (27), మహ్మద్ మోసిన్ (26) ఇద్దరూ బోరబండకు చెందినవా రిగా గుర్తించడమే కాకుండా బ్యాగును ఫర్వాన్ తన ఇంట్లో దాచిపెట్టినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కంటి ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి




కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సంస్కార్ సేవా ఫౌండేషన్ చైర్మన్ ఆకుల శ్రీ రాములు

**చార్మినార్,డిసెంబరు 15 ప్రభాతవార్త :** ప్రతీ ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ఎప్పటి కప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంస్కార్ సేవా ఫౌండేషన్ చైర్మన్ ఆకుల శ్రీ రాములు అన్నారు.నవంబరు నెల పదహారువ తేదీనపాతబస్తీ ఉప్పుగూడలో మల్టీ స్పెషాలిటీ వైద్య ఆరోగ్యం శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించిన వారికి సంస్కార్ సేవా ఫౌండేషన్ తరుపున ఎస్‌కెవి బ్యాంకెట్ హాల్‌లో ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆకుల శ్రీ రాములు మాట్లాడుతూ ప్రజలు కంటి చూపు విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ కాసారపు చంద్రకుమార్,బిట్ల సంధ్య,అదితి,కె.శ్రీధర్‌రావు,పాసు కృష్ణ,కె.భారత కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు సనాతన ధర్మానికి ప్రతీకలు




నృత్య కళాకారులను సత్కరిస్తున్న బీజేపీ తెలంగాణ కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి, హులిగమ్మ దేవాలయం (హులిబి) చీఫ్ ట్రస్టీ డాక్టర్ హులిగమ్మ పోస

**చిక్కడపల్లి డిసెంబర్ 15 (ప్రభాతవార్త ) :**

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని బీజేపీ తెలంగాణ కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి, హులిగమ్మ దేవాలయం (హులిబి) చీఫ్ ట్రస్టీ డాక్టర్ హులిగమ్మ పోస అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారత నృత్య పోటీలు నిర్వాహక సంస్థ అధినేత జి ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రొయ్యూరు శేషసాయి మాట్లాడారు. భారతదేశ సంస్కృతిలో భాగమైన ఈ కళాకారులను ప్రోత్సహించిన అవసరం ప్రభుత్వాలపై ఉన్నాయని, ఈ కళాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించవలసి ఉందని ప్రోత్సహించ వలసిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన నాట్య బృందాలు నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి.గణేష్ మాస్టర్, ప్రముఖకొరియోగ్రాఫర్, కపిల్ మాస్టర్, కొరియోగ్రాఫర్ సౌజన్యమురళీధర్ సంఘ సేవకులు, జి.హారతి, సరిత, ఖమ్మం నాట్య గురు రాజమండ్రి కళాకారులు నాట్య బృందాలు పాల్గొన్నారు.

## కేసు తప్పించడానికి లంచం

**- ఆటోలో డబ్బులు వేయించిన ట్రాఫిక్ పోలీసులు**
**- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పైలెట్ వీడియో వైరల్**



హోంగార్డు సూచన మేరకు ఆటో వద్దకు వెళ్తున్న వాహనదారుడు



ఆటోలో వేసిన డబ్బులు.

**జూబ్లీహిల్స్, డిసెంబరు 15, ప్రభాతవార్తః**

కేసు రాయకుండా ఉండాలంటే అడిగిన లంచం ఇవ్వాల్సిందేనంటూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పైలెట్ లంచావతరం వీడియో కాస్త వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నర్సింగ్‌రావుకు కేశవ్ అనే హోంగార్డు పైలెట్‌గా ఉన్నాడు. ప్రతి రోజు జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీ కూడలిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అటువైపుగా వచ్చిన ఒక వాహనదారుడిని నిలువరించారు. సరైన పత్రాలు లేకపోవడంతో హోంగార్డు కేశవ్ వాహనదారుడిని పక్కకు తీసుకెళ్లాడు. అతనితో బేరాలు ఆడాడు. పక్కన నిలిపిన ఒక ఆటోలో తాను చెప్పిన డబ్బులు వేయాలంటూ సూచించాడు. ఆ వాహనదారుడు కాస్త రూ. 500లను ఆటోలో వేసి వెళ్లాడు. అప్పటికే ఆ ఆటోలో మరికొన్ని డబ్బులు సైతం ఉన్నాయి. ఇది కాస్త అక్కడే ఉన్న అతని స్నేహితుడు తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఇది కాస్త స్థానికంగా వైరల్‌గా మారింది. స్థానికంగా పలు గ్రూపుల్లో ఈ వీడియో చక్కర్లు కొట్టింది. కాగా ఈ వ్యవహారంపై నిఘా వర్గాలు సైతం దృష్టి పెట్టాయి. అధికారితో పాటు హోంగార్డు ప్రమేయంపై దృష్టి సారించాయి.

### ప్రేమ పేరుతో దగ్గరయ్యారు.. పెళ్లంటే వద్దన్నారు.

**జూబ్లీహిల్స్, డిసెంబరు 15, ప్రభాతవార్తః**

వేర్వేరు సంఘటనల్లో ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లి మాటెత్తగా ముఖం చాటేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైన సంఘటనలు ఇవి. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాల్లోకి వెళితే.. జార్ఖండ్‌కు చెందిన సూరజ్‌కుమార్ ఒక యువతితో కొద్ది కాలంగా కలిసి ఉంటున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. నవంబరులో ఊరికి వెళ్తానంటూ చెప్పి వెళ్లిన సూరజ్ కుమార్ అక్కడ మరో యువతితో వివాహం నిశ్చయం చేసుకున్నట్లు యువతి గుర్తించింది. దీంతో తనకు చేసిన మోసంపై నిలదీయగా పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీంతో యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరో సంఘటనలో..** బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాల్లోకి వెళితే.. ఒక నాలెడ్జ్ సిటీలో పనిచేసే ఒక యువతికి అక్కడే సెక్యూరిటీగార్డుగా పనిచేసే పూల్‌చంద్‌దాస్(28) పరిచయం ఏర్పడింది. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అతను ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. మాదాపూర్‌లోని ఒక హోటల్‌లో సైతం జులైలో కలిశారు.ఇటీవల పెళ్లి చేసుకోమని కోరగా అందుకు నిరాకరించిన అతను ఆమె సెల్‌ఫోన్ నంబరును సైతం బ్లాక్‌లిస్టులో పెట్టాడు.దీంతోయువతి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బంజారాహిల్స్‌లో బ్యూటీ లాంజ్ మాటున వ్యభిచారం

**- జూబ్లీహిల్స్‌లో సెల్లార్‌లో జూదం**

**జూబ్లీహిల్స్, డిసెంబరు 15, ప్రభాతవార్తః**

బ్యూటీ లాంజ్ మాటున వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక కేంద్రంపై బంజారాహిల్స్ పోలీసులు దాడి చేసిన సంఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని అరోరా కాలనీలో ఏఎస్ఆర్ బ్యూటీ లాంజ్ పేరుతో ఒక కేంద్రం ఉంది. కాగా అందులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు ఆయా కేంద్రంపై దాడి చేశారు. ఇందులో భాగంగా ఆవుల సత్యప్రకాశ్‌రెడ్డి వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నలుగురు యువతులతోపాటు విటులైన అనీల్, రామాంజనేయులును అదుపులోకి తీసుకొన్నారు. వీరి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ. 2330 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సెల్లార్‌లో జూదం.. 9 మంది అరెస్ట్

జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని నైక్ షోరూం సెల్లార్‌లో జూదమాడుతూ తొమ్మిది మంది జూబ్లీహిల్స్ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా జూదమాడుతున్న పరంశెట్టి అర్జున్, పితాని అప్పారావు, ఎనకోటి జగదీష్, కొండేపూడి సాయికృష్ణ, జానకి రామయ్య, దంగేటి శ్రీనివాస్, కరిచెర్ల వీరబాబు, కూరుపూడి శివ, గంగ శ్రీనివాస్, వనం వీరబాబు, గడి మంగన్నలు జూదమాడుతూ పట్టుబడ్డారు. వీరిపై తెలంగాణ గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి రూ. 8300ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## ప్రజలు యేసు క్రీస్తు మార్గంలో నడవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్


రసూల్ పురాలో క్రిస్టియన్ సెలబ్రేషన్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,డిసెంబర్ 15 ప్రభాతవార్త:** లోక రక్షకుడు యేసుక్రీస్తు మార్గాన్ని అనుసరించి ఆయన మార్గంలో నడవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మినీ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని కంటోన్మెంట్ 2వ వార్డు రసూల్‌పుర,6వ వార్డు కంట బస్తీలో నిర్వహించిన మినీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. త్యాగం, శ్రమ, ప్రేమ గుణాలను కలిగి శాంతి సౌభ్రాతృత్వంతో నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఫాస్టర్లు సీనియర్ కాంగ్రెస్ నేత స్యామ్ సన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### జిహెచ్‌ఎంసి 196 డివిజన్‌ను మారేడ్‌పల్లిగా మార్చాలి : నాగేశ్


డిప్యూటీ కమీషనర్ డాకూ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నేత పిట్ల నాగేశ్ తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 15 ప్రభాతవార్త:** గ్రేటర్‌లోని 196 డివిజన్‌ను మారేడ్‌పల్లి డివిజన్‌గా మార్చాలని బిజెపి ఓబిసి కన్వీనర్ పిట్లనాగేశ్ బేగంపేట్ సర్కిల్ పిట్ల నాగేశ్ డాకూ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న 150 డివిజన్‌నుమోండా డివిజన్‌గా ఉన్నది.అయితే డీ లిమిటేషన్లలో మోండాలో ఉన్న 9 బూత్‌లను బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో విలీనం చేశారు. అయితే మోండా పేరుతో ఉన్న ప్రాంతాలు బన్సీలాల్‌పేట్‌లో విలీనం చేసినందుకు డీ లిమిటేషన్ 196 డివిజన్‌ను మారేడ్‌పల్లి డివిజన్‌గా మార్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రషీద్, రాజు, సురేందర్, వేణుగోపాల్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప మహాపడిపూజలో కార్పొరేటర్ విజయారెడ్డి


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న విజయారెడ్డి.

**ఫిల్మ్‌నగర్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ దుర్గాభవానీనగర్‌లో నాగేష్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన 18వ మహాపడి పూజ కార్యక్రమానికి ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనడంతోపాటు అయ్యప్పస్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప భజన కార్యక్రమంలో స్వాములు ఉత్సాహంగా పాల్గొని అయ్యప్ప స్వామి పాటలతో పూజకు మరింత శోభను తీసుకొచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇదే పూజా కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు వేర్వేరుగా పాల్గొన్నారు.

### బస్తీ అభివృద్ధికి కృషి చేయండి : కార్పొరేటర్ వెంకటేష్


నూతన కమిటీతో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్.

**ఫిల్మ్‌నగర్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్ నగర్ బస్తీ కమిటీ సోమవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఇటీవల జరిగిన బస్తీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శిగా అశోక్ ఎన్నికయ్యారు. కాగా వీరంతా కార్పొరేటర్‌ను కలిశారు. ఈ మేరకు కార్పొరేటర్ వారిని శాలువాతో సన్మానించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీలోని ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బస్తీ అభివృద్ధిలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. బస్తీ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బస్తీకి చెందిన ఎ.కె. నరసింహ, సత్యనారాయణ, గిరి, బాబు, వెంకటేష్, కుమార్‌యాదవ్, ప్రకాశ్, అనీల్‌కుమార్, యువత జన అధ్యక్షుడు భీమేష్ యాదవ్, యూత్ ఉపాధ్యక్షుడు సాయియాదవ్, సంయుక్త కార్యదర్శి కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యసాయికృష్ణ, నిర్వాహకుడు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగీతంతో మానసిక ఒత్తిడి దూరం


సంగీత ప్రవీణులు తాడేపల్లి సాయి ప్రసాద్‌ను సత్కరిస్తున్న లక్ష్మీ శారద

**సైఫాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** సంగీతంతో మానసిక వత్తిడి దూరమవుతుందని, తద్వారా మనిషి ఎంతో ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉంటుందని ప్రముఖ సంగీత ప్రవీణులు తాడేపల్లి సాయి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు హిమాయత్‌నగర్‌లోని శ్రీముఖి కాంప్లెక్స్‌లోని సరేగా స్టూడియోలో నెల్లూరుకు చెందిన లక్ష్మీ శారద నిర్వహణలో, శ్రద్ధ గ్రూప్ ఆధ్వర్యంలో శారదా సురాగాలు సీజన్-2, కమ్మని కలలకు ఆహ్వానం శీర్షిక పేరుతో సంగీత విభావరి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మెడికల్ సర్వీసెస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బి.రాము, జీజీహెచ్ నల్గొండకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ జి.నరసింహారావునేత, తెలంగాణ ఉద్యమకారులు, ప్రముఖ గాయకులు ఢిల్లీ, సంగీత ప్రవీణులు తాడేపల్లి సాయి ప్రసాద్, ప్రగ్నిక ఫౌండేషన్ వ్యవస్థాపకులు పారిజాత ప్రవీణ్, త్రివిహారి ఈవెంట్స్ ఫౌండర్ త్రినాథ్ పాల, గాయకులు, టెలివిజన్ ఆర్టిస్ట్ డాక్టర్ రవీంద్రనాథ్ ఆచార్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సంగీతం యొక్క విశిష్టత, సంగీతం వల్ల మానవునికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు. గాయకులు 12 గంటల పాటు నిర్విరామంగా ఆలపించిన పాటలు ఆహుతులను విశేషంగా అలరించాయి. అనంతరం అతిధులను శాలువాలతో, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధ గ్రూప్ ఆరంభ్ అరణ్య ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఎస్.ఎన్. గాయకులు సురేష్, దేవాన్షి, లాస్య, ఎన్.అమర్‌నాథ్, యాంకర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలతోనే డివిజన్లను ఏర్పాటు చేయండి

### - కమిషనర్‌కు ఎమ్మెల్యే దానం వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దానం నాగేందర్, వనం సంగీతయాదవ్, మామిడి నర్సింగ్‌రావు, రాములు చౌహాన్, వనం శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసీ వార్డుల విభజనలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలతోనే డివిజన్లు ఏర్పాటుచేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వినతిపత్రం అందించారు. సోమాజీగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు మామిడి నర్సింగ్‌రావు, రాములు చౌహాన్, వనం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిశారు. ఇటీవల జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజనలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గాన్ని ఎనిమిది డివిజన్లుగా ఉండేలా చూడాలన్నారు. అలాగే ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉండే ప్రాంతాలనే ఉండనివ్వాలని, ఇతర నియోజకవర్గాల ప్రాంతాలు ఉండటం వల్ల సమస్యలు తలెత్తుతాయని ఎమ్మెల్యే, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇతర నియోజకవర్గంలోని ప్రాంతాలు ఉండటం వల్ల అక్కడి స్థానికులు ఇబ్బందులు పడుతారన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని పునర్విభజన చేయాలని, తద్వారా అది అందరికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి 227 డివిజన్ ఏర్పాటు పారదర్శకంగా లేదు : కొండల్‌రెడ్డి


శేరిలింగంపల్లి 227డివిజన్‌లో యంఐజీ కాలనీని కలువద్దంటూ జోనల్ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న కొండల్‌రెడ్డి, కాలనీ వాసులు

**శేరిలింగంపల్లి,డిసెంబర్ 15 ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి నియోజవర్గంలోని నూతనంగా ఏర్పాటు చేసిన 227 డివిజన్ పారదర్శకంగా లేదని, జీహెచ్‌ఎంసీ అధికారులు మార్పులు చేయాలని పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బద్ద కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి 106 డివిజన్‌ను మూడు ముక్కలుగా విభజించారని, నల్లగండ్ల గ్రామంలో ఉన్న ఎంఐజీ కాలనీని వీటిలో కలిపారన్నారు. ఎంఐజీ కాలనీ గతంలో జరిగిన మునిసిపల్ కౌన్సిలర్ ఎన్నికల్లో ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారని, 2009 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గచ్చిబౌలి డివిజన్‌లో కలిపారన్నారు. 2018 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో భారతినగర్‌డివిజన్‌లో కలిపారని తెలిపారు. ప్రస్తుతం శేరిలింగంపల్లి 227 డివిజన్‌లో శేరిలింగంపల్లి, తారానగర్, పాపిరెడ్డినగర్, రాజీవ్ గృహకల్ప, ఆరంభ్ టౌన్‌షిప్,సందయ్యనగర్, సురభి కాలనీ, ఆదర్శనగర్, నెహ్రూనగర్,గోపినగర్, బాపూనగర్, డోయన్స్‌కాలనీ,జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 150ఫీట్ల రోడ్డుకు ఎడమ వైపు ఉన్న అపార్ట్‌మెంట్లు,మదీనగూడ గ్రామ శివారులో ఉన్న ఉదయ్ కో-ఆపరేటివ్ సొసైటీ, నార్నె ఎస్టేట్,శిల్ప ఎన్‌క్లేవ్, ఎస్ఎల్లా విల్లాస్,కమల ఎస్టేట్, వెంకటేశ్వర కాలనీ తదితర కాలనీలన్నీ కలిపి సుమారు 50వేల నుంచి 60వేల వరకు ఓటర్లు ఉంటారన్నారు . శేరిలింగంపల్లి 227 డివిజన్‌ను వీటన్నింటితో కలిపి ఏర్పాటు చేయాలని, ఎంఐజీ కాలనీ మొత్తం కలిపి, రైల్వేకాలనీ, హుడా ట్రేడ్ సెంటర్, నల్లగండ్ల గ్రామ శివారు కావున వాటిని నల్లగండ్ల డివిజన్ 226లో కలపాలని పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

### డీ లిమిటేషన్‌లో తప్పిదాలను సరిచేయాలి : బిఆర్ఎస్


డిసి డాకూ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు గుర్రం పవన్,స్కైలాబ్ యాదవ్,ఆకులరూప తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 15 ప్రభాతవార్త:** గ్రేటర్‌లోని వివిధ డివిజన్ల డీ లిమిటేషన్లతో జరిగిన తప్పిదాలను వెంటనే సరిచేయాలని బిఆర్ఎస్ ప్రతినిధి బృందం సోమవారం డిప్యూటీ కమీషనర్ డాకూ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేత గుర్రం పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో చేపట్టిన డీ లిమిటేషన్‌లో చేపట్టిన నూతన ఏర్పాటు సరిహద్దుల గుర్తింపు తప్పుల తడకగా గందరగోళంగా ఉందని డిసికి వివరించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్ పేట కార్పొరేటర్ హేమలత, మాజీ కార్పొరేటర్ ఆకురూప, పద్మారావు నగర్ డివిజన్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్,తలసాని స్కైలాబ్ యాదవ్,నాగులు, యేసూరి మహేశ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

**ముషీరాబాద్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పీ.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని, విద్యార్థులు అస్వస్థతకు గురికావటం తీవ్ర ఆందోళన కలిగించిందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురుకుల విద్యార్థులు బలవుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవటం లేదంటే, గురుకుల పాఠశాలలను ఎత్తివేయాలనే కుట్రలకు పాల్పడుతున్నారేమోనని అనుమానంగా ఉందన్నారు. కలుషిత ఆహారం తిని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ప్రభుత్వ ప్రతినిధులు, అధికారపార్టీ నేతలు పరామర్శించాలని, కలుషిత ఆహారంకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, తడక వినోద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీ వాళ్లతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి


డి లిమిటేషన్‌పై వినతి పత్రం అందచేస్తున్న టిడిపి నాయకులు కె.డి.దినేష్

**గోషామహల్,డిసెంబర్ 15ప్రభాతవార్త:** ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్తగా జిహెచ్‌ఎంసి డీ లిమిటేషన్ విధానం మంచిది కాదని ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం టిడిపి నాయకులు కె.డి.దినేష్,ప్రేమ్‌కుమార్‌లు అన్నారు. సోమవారం జిహెచ్‌ఎంసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో గోషామహల్ నియోజకవర్గంలోని ఇష్టానుసారంగా డిలిమిటేషన్ చేసినట్లు ఫిర్యాదు చేశారు.ప్రతి వార్డులో జిహెచ్‌ఎంసి డిప్యూటి కమీషనర్ అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి డిలిమిటేషన్‌పై ఎలాంటి అభిప్రాయాలు సేకరించలేదన్నారు.ఒకడివిజన్‌లో 60వేల ఓట్లు, ఒక డివిజన్‌లో 40వేల ఓట్లు ఉన్నట్లు ఆరోపించా రు.ప్రభుత్వం తీసుకున్ననిర్ణయంతో అన్యాయంగా ఉంద న్నారు. రాజకీయ పార్టీలు,కుల సంఘాలతో కులవారిగా చర్చించి ప్రచారం చేసి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సుభాష్‌నగర్ డివిజన్‌పేరును మార్చాలి : రవిందర్ ముదిరాజ్

**జీడిమెట్ల, డిసెంబరు 15 ప్రభాతవార్త :** సుభాష్‌నగర్ డివిజన్ పేరు తొలగించి సూరారం బలహీన వర్గాల కాలనీగా నామకరణం చేయాలని కోరుతూ పర్యావరణ వేత్త కోల రవిందర్‌ముదిరాజ్, బిజెపి నాయకులు కంది శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. సోమవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మాకు ఈమేరకు లిఖితపూర్వక విజ్ఞప్తిని అందజేశారు.

## కోరి రోబోటిక్ సర్జికల్ సిస్టమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి,నగర్,డిసెంబర్ 15 ప్రభాతవార్త:** వైద్య సేవలు,ఆరోగ్య సంరక్షణ రంగంలో వినూత్న పద్ధతులకు మారుపేరు అయినా రెనోవా అస్పటల్స్,ఆర్థోపెటిక్ చికిత్సలో కొత్త మైలురాయిని చేరుకుంది.మిడ్‌లెవల్ అసుపత్రి విభాగంలో మొట్ట మొదటి సారిగా అత్యంత అధునాతనమైన కోరి రోబోటిక్ సర్జికల్ సిస్టమ్‌ను సనత్ నగర్ జెక్ కాలనీలో తమ అసుపత్రిని ప్రారంభించింది. ఈ ప్రతిష్టాత్మక వ్యవస్థను ముఖ్య అతిథులుగా సనత్ నగర్ ఎమ్మెల్యేతలసాని శ్రీనివాస్ యాదవ్,రెనోవా గ్రూప్ ఆఫ్ ఆస్పటల్స్ పౌండర్, సిఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డిలు ప్రారంభించచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ అత్యాధునీక కోరిరోబోటిక్ సర్జికల్ సిస్టమ్‌ను మెడ్‌లెవల్ ఆస్పటల్ సనత్ నగర్ ప్రాంతంలో మొట్ట మొదటి సారిగా ప్రవేశపెట్టడం గర్వకారణమని రెనోవా ఆస్పటల్స్ వైద్య నిపుణులను, యాజమాన్యాన్ని తలసాని అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలనగర్ ఏసీపీ పి.నరేశ్ రెడ్డి, సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, సనత్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్‌లు,డాక్టర్లు ఉదయ భాస్కర్, సుధీర్ రెడ్డి,ప్రశాంత్, బిఆర్.కె, మనోజ్ సాయి,రాజారామ్, కె.రాఘవ్ సునీల్, మహ్మద్ హాసీఫ్ అనీఫ్, జాహిద్, అకాశ్ జైస్వాల్,అరుణ్ దేవ్,రవింద్రనాథ్, గరగ, ఖాజా హీర్ అహ్మద్ పాల్గొన్నారు.

### నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభం


డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకరవర్గంలోని ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్‌లో నూతన డ్రైనేజి పైప్‌లైన్ పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎడ్ల హరిబాబుయాదవ్, కె.బాబురావు, శ్రీకాంత్ ముదిరాజ్, అజయ్ ముదిరాజ్, మంథని దశరథ్, ఎయిర్‌టెల్ రాజు, శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, బి.శ్రీనివాస్, జి.అశోక్, పాన్‌షాప్ బాబు, నరేష్‌ముదిరాజ్, గోరఖ్‌నాథ్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ల విభజనను పారదర్శకంగా చేపట్టాలి

### -సర్కిల్ కార్యాలయంలో బిజెపి నేతల ఫిర్యాదు



**అత్తాపూర్ డిసెంబర్ 15,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్‌ఎంసిలో చేపట్టిన డి లిమిటేషన్‌తో ప్రజలను గదరగోళానికి గురిచేస్తుందని డివిజన్‌ల విభజనను పారదర్శకంగా నిర్వహించాలని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు.సోమవారం బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శివరాంపల్లి గ్రామాన్ని, సులేమాన్ నగర్‌లో కలిపారు.మరియు ఉప్పరపల్లిలో కొంత భాగం హైదరగూడ డివిజన్‌లో కలపడంతో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పలువురు బిజెపి నాయకులు అభ్యంతరం తెలుపుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...ఉప్పర్‌పల్లి , శివరాంపల్లి గ్రామాన్ని పూర్తిగా రాజేంద్రనగర్ డివిజన్ లో కలుపాలని పేర్కొన్నారు.డీ లిమిటేషన్‌తో మొత్తం గదరగోళంగా మారిందని తిరిగి ప్రజాభిప్రాయాల సేకరణతో మళ్లి వీలిన ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు శ్రీధర్,కోరాని సదానంద్, మల్లేష్ యాదవ్,హరి కిషన్ జి, సోల్కర్ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి, ఉ.పవన్ ,గుంటి రాజకుమార్ ,మల్లేష్ చారి,సురేందర్,సరిత రెడ్డి,అంబిక,పద్మావతి,రజిని గుప్తా,తిరుమలేష్,విజయ్ యాదవ్ శివ కుమార్,జంగయ్య, మరియు నాయకులు పాల్గొన్నారు .

### పేదలను ఆదుకోవాలి

**అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 15ప్రభాతవార్త:** చల్లికి తట్టుకొలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నిరుపేదలకుస్వచ్ఛంద సంస్థలు ఆదుకునేందుకు ముందు రావాలని నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జిసిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు.డాక్టర్ మెల్‌కోటే పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందుగా జడల మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిరుపేదలకు దుప్పట్లను పంపిణి చేశారు.

## 21 నుంచి ప్రపంచ శాంతి కోసం 'పత్రీజీ ధ్యాన మహాయాగం-4'


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి, మధుమోహన్, నిర్మాలాదేవి

**సైఫాబాద్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో విశ్వ శాంతి కోసం ప్రపంచ ధ్యాన దినోత్సవ సంబరాలు 'పత్రీజీ ధ్యాన మహాయాగం-4' ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని సొసైటీ ఛైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ట్రస్టీలు మధుమోహన్, నిర్మాలాదేవితో కలిసి ఈ మహాయాగంకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాయాగం రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్ మండలంలోగల అన్మాస్‌పల్లి గ్రామంలోని శ్రీ సరస్వతి సభా ప్రాంగంలో 'పత్రీజీ శక్తిస్థల్' కైలాసపురిలో ఈ సంబరాలు జరుగుతాయని వారు వివరించారు. 11 రోజుల పాటు జరిగే ఈ సంబరాలకు వచ్చేవారికి ఉచితంగా అల్పాహారం, రెండు పూటల భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రముఖ అధ్యాత్మిక గురువులు 21వ తేదీన శ్రీరాములు మహారాజ్, డా.సుమన్ కొల్లిపర (కెనడా), 22వ తేదీన శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి, 23వ తేదీన 111 సంవత్సరాల శ్రీబాబా సంత్ సదానంద గిరి మహారాజ్, శ్రీసుమిత్రానంద సరస్వతి, 24వ తేదీన శ్రీస్వామి అంతర్ముఖానంద, 25న శ్రీస్వామి గోవింద్ దేవ్ గిరి మహారాజ్, ఆచార్య రామ్మూర్తి, మహా విద్యానంద గిరి మాతాజీ, 26న డా.క్రోవి పార్థసారథి, 27న నూకల ప్రభాకర్‌శర్మ, 28 ఆధ్యాత్మిక గురు సమ్మేళనం, 29న ఓషా చైతన్య కీర్తి, 30న స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతిచే ప్రతి రోజు ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్మాతిక ప్రవచనాలు కొనసాగుతాయని తెలిపారు.

## పాతబస్తీలోని ప్లే గ్రౌండ్లకు ప్రహరీ గోడలను ఏర్పాటు చేయాలి


జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్ (స్పోర్ట్స్) కె.మంగతాయారుకు వినతి పత్రం అందజేస్తున్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,కాంగ్రెస్ నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఉందాబజార్‌లోని శివాజీ ప్లే గ్రౌండ్, కిషన్‌బాగ్ డివిజన్ పరిధి బహదూర్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీలోని జిహెచ్‌ఎంసి ప్లే గ్రౌండ్‌కు ప్రహరీ గోడలను నిర్మించి,ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్‌జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్ (స్పోర్ట్స్) కె.మంగతాయారుకు వినతి పత్రం అందజేశారు.ప్లే గ్రౌండ్‌లలోఆడుకోవటానికి క్రీడా సామాగ్రిని అందించాలని కోరామని రాజేష్ కుమార్ తెలిపారు.తక్షణమే స్పందించిన జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్ (స్పోర్ట్స్) కె.మంగతాయారు అవసరమైన క్రీడా సామాగ్రిని అందించాలని మొగల్‌పుర స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ రవూఫ్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీర్ మహ్మద్ అలీ,న్యాయవాది జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

### పాఠకుల ఆదరణకుమించిన పురస్కారం లేదు : ఆచార్య బేతవోలు రామబ్రహ్మం


బేతవోలు రామబ్రహ్మంను సత్కరిస్తున్న శివారెడ్డి, చెన్నయ్య, సిల్మానాయక్‌లు

**రవీంద్రభారతి, డిసెంబరు 15 ప్రభాతవార్త :** సమాజంలో పాఠకుల ఆదరణకు మించిన పురస్కారమేదీ లేదని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మం స్పష్టం చేశారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో సోమవారం రాత్రి జరిగిన పరిణతవాణి ప్రసంగ కార్యక్రమంలో ప్రధానవక్తగా రామబ్రహ్మం ప్రసంగించారు. తాను రచించిన ఆధునిక వేమన శతకం, క్రొత్త గోదావరి పద్యకృతులు; పద్యకవితా పరిచయం; వ్యాసగౌతమి; పద్యారామం వంటి విమర్శా గ్రంథాలు, మృచ్ఛకటికం ఉత్తర రామచరితం, సంస్కృత నాటక వ్యాఖ్యాగ్రంథాలు, హరివంశం, ఉత్తర రామాయణం, షట్చక్రవర్తి చరిత్ర, వర్ధన రత్నాకరం వంటి పద్యకావ్య వ్యాఖ్యాన రచనలు పాఠకుల ఆదరణకు నోచుకున్నాయని, దేవీ భాగవతం యథాతథంగా తెలుగు అనువాదం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారమే కాకుండా లక్ష కాపీలు అమ్ముడై ఎంతో సంతృప్తినిచ్చాయని వివరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య స్వాగతోపన్యాసంలో ఆచార్య రామబ్రహ్మం నాగార్జున, కేంద్రీక విశ్వవిద్యాలయం వేదికలుగా తెలుగు సాహిత్య బోధన, పరిశోధన, అధ్యయన రంగాలను సుసంపన్నం చేశారని తెలుపగా పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో ఆచార్య బేతవోలు సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలలో విశేష పాండిత్యం కలవారని ప్రశంసించారు. రాష్ట్రపతి ప్రశస్తి పురస్కారాన్ని దక్షిణాది భాషల నుండి అందుకుని తెలుగు సాహిత్యానికి ఎనలేని గౌరవం తీసుకొచ్చారని కొనియాడారు. చివరిగా రామబ్రహ్మంను ఘనంగా సత్కరించారు.

## జంట సర్కిళ్లలో ప్రజావాణికి సమస్యల వెల్లువ

### కుత్బుల్లాపూర్‌లో టౌన్‌ప్లానింగ్, గాజులరామారంలో ఇంజనీరింగ్‌పై ఫిర్యాదులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 15 ప్రభాతవార్త :** ప్రజావాణిలో సమస్యలపై ప్రజలు పెద్దఎత్తున తమ ఫిర్యాదులను నమోదు చేసుకున్నారు. దీనికితోడు వార్డుల పునర్విభజన లో ఆయా కాలనీలు, బస్తీల ప్రజలకు సమాచారంలేకుండా ప్రాంతాలలోని డివజన్లను ప్రభుత్వం ప్రకటించడంతో ఆయా బస్తీలు, కాలనీల ప్రజలు తమ బస్తీ, కాలనీలపైనే డివిజన్‌ను రూపొందించాలంటూ దరఖాస్తులు చేసుకున్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ సర్కిల్,గాజులరామారం జంట సర్కిళ్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా మొత్తం ఏడు దరఖాస్తులు రాగా టౌన్‌ప్లానింగ్ నుండి ఒకటి, ఇంజనీరింగ్‌విభాగంపై నాలుగు,ఎలక్ట్రికల్ విభాగానికి ఒక ఫిర్యాదు నమోదు అయ్యాయి.

**కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో....**

కుత్బుల్లాపూర్ సర్కిల్ లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మా అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 సమస్యలపై ఫిర్యాదులు రాగాఅందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి నాలుగు ఫిర్యాదులు, ఇంజనీరింగ్ విభాగానికి నాలుగు, ఎలక్ట్రికల్ విభాగానికి రెండు, యుబిడి విభాగానికి ఒక ఫిర్యాదు నమోదయ్యాయి.

## ఎంపీ ఈటల సహకారంతో కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : బానుక


1వ వార్డు గ్రీన్ ఫీల్డ్ కాలనీలో ఓపెన్ నాలా పనులను ప్రారంభిస్తున్న బానుక నర్మధ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 15 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. 1వ వార్డు గ్రీన్ ఫీల్డ్ కాలనీ (అయ్యప్ప సొసైటీ )లో 12 లక్షల కంటోన్మెంట్ బోర్డునిధులతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ నాలా పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్మధ మాట్లాడుతూ ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో బోర్డు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్మంలో సత్య నారాయణ, భాస్కర్ రావు,ఖలీమ్, రామ్‌సింగ్,మనోజ్,సురేశ్,బిజెపి అధ్యక్షుడు జైపాల్ రాఖేష్ పాల్గొన్నారు.


**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II, AT: TRIVENI COMPLEX, 1st FLOOR, ABIDS, HYDERABAD**

**O.A. No. 854 of 2025**

Between:
HDFC Bank Ltd. ....Applicant
And
M/S. Satturi Yadaiah Goud ....Defendant/s

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
1. Satturi Yadaiah Goud, S/o.Lingaiah Goud Age:48 Years, Occ: Self Employed 18-9-9/29/1, Chandryan Gutta Vtc, Bandlaguda, Opp Mch Ground, Hyderabad-500005
Also at: Satturi Yadaiah Goud, P No 16, Vpart K K Enclave, Kranth Nagar Karmanghat, Hyderabad-500079.
Aslo at: Satturi Yadaiah Goud C/o.Sam Fitness Centre No 6-310 2nd Floor Lenin Nagar, Balapur X Road, Hyderabad-500005 ...Defendant/s

Please take the summons in the above O.A. No. 824/2025 filed by the applicant for recovery of money of ₹ .32,45,058.80/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" English daily newspaper and posted the matter to 12-01-2026.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i)To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii)You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv)You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and /or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v)You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 12-01-2026 at 10.30 a.m. at Debts Recovery Tribunal-I, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted. Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day;12th day of December, 2025.

(By Order of the Court)
Signature of the Officer Authorized to issue Summons



తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ :: LB నగర్ సర్కిల్-4** GHMC
సంక్షిప్త టెండర్ ప్రకటన

నిట్ నం. 31/EEC-4/LBNR/GHMC/2025-26, తేది: 15.12.2025
పని పేరు: నిర్వహణ పనులు-04 సం.లు, అంచనా మొత్తం: రూ.33.85 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ, సమయం: 16.12.2025 మ.03.00 గం. 23.12.2025 మ.03.00 గం. ఆఫీసర్ పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ వి. కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, LB నగర్ సర్కిల్-4, GHMC (M) 9701365519. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, LB నగర్ సర్కిల్-4, GHMC
DIPR.No.12017-PP/CL/Advt/1/2025-26, తేది: 15.12.2025



**PUBLIC NOTICE**

**IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT MALKAJGIRI**
**O. S. No. 73 of 2021**

Between:
Ashoka Shetty S/o. late S. Sathyanarayana, R/o, H.No.11-3-392/2/13, Srinivasa Nagar, Secunderabad. ... Plaintiff
And
Smt. A. Bharatamma W/o. A. Anjaiah, & 6 others ... Defendants
To,
1.Smt. Y. Bhagyalakshmi W/o Y. Vijaya Reddy Age. 62 yrs.- Wife
2. Y. Chandra sekhar reddy S/o Y. Vijaya Reddy, Age 37 yrs. - Son both C/o late Y. Vijaya Reddy, H.No.3-120, Yapral Village Post, J.J. Nagar Malkajgiri Mandal, Ranga Reddy District, T.S.
... Defendant Nos. 6 & 7
That the plaintiff filed suit for Perpetual Injunction against 5 defendants in respect of suit schedule of property. During pendency of the suit, defendant No. 4 Y. Vijaya Reddy died. You being the L.Rs. of deceased Defendant-4, notices were issued to implead both of you as defendants No. 6 & 7 in the suit. As the notices were returned unserved, paper publication is given to serve the summons on you. So please take notice to appear before Hon'ble Court in the suit either in person or through a Counsel on 05-01-2026 at 10.30 A.M along with your answers, if any, failing which the case will be decided setting you ex-party.
(as per the orders of Hon'ble Court)
Malkajgiri
Dt.16-12-2025
**J. Ch. Y. NARASIMHAM, Advocate,**
Counsel for plaintiff
Flat No. 102, Nidhi Apartments, Rd. No.7, Gandhinagar, Hyderabad - 80.
Ph: Cell: 9247465599



**NOTICE**

**IN THE COURT OF HON'BLE XVII ADDL. SENIOR CIVIL JUDGE, AT CCC, HYDERABAD**
**O.S.No. 1500 OF 2025**

BETWEEN:
**Smt. Rekha R.Jai Chander and 2 others** ...Plaintiffs
AND
**1) The Thasildhar,** Saidabad Mandal, Hyderabad.
**2) All concerned.** ...Defendants
To
**1) The Thasildhar,** Saidabad, Hyderabad, Opp Rose Garden Champapet main Road, Saidabad, Hyderabad
**2) All concerned.**
Please take notice that the plaintiffs have filed the suit for deceleration of legal heir of Late Dr. Satish Kumar Kanappa and consequently declare them as possessors and successors of the below mentioned schedule "A" and "B" property, the above case is posted on **07-01-2026 at 10:30 AM** for making any objections if any. If no objections are raised the Hon'ble court will proceed with the matter and no objections will be entertained thereafter and the matter will be decided on merits.

**SCHEDULE "A" PROPERTY**
All that part and parcel of the Flat No. 301 in 3 rd Floor of AARTHI TOWERS, with plinth area of 1035 square feet, including common areas and balconies, together with undivided share of land 29.5 square yards or 24.66 square meters undivided share of land out of 674.00 square yards of the premises No. 16-1-30/A/9, & 16-1-30/A/13 on Plot no. 9 & 13 situated at Lokayuktha Colony, Saidabad, Hyderabad bounded by North : Stair case and Tot Lot : South : Open to sky : East : Open to sky, West : Corridor & open to sky

**SUIT SCHEDULE "B" PROPERTY**
All that part and parcel of the open Plot bearing Plot No. 357, admeasuring 200 square yards, or 167.23 square meters, in Sy. No. 255 situated at Paradise Valley of Pedda Amberpet Village, Hayath Nagar, Revenue Mandal, Ranga Reddy district, and bounded by : North : Plot No. 358 South : Plot No. 356 East : 33 ft wide road: West : Plot No. 354
By the Order of the Court
**Sd/- P. Amarender Reddy, P. Srinivas Reddy Advocates**
R/o 17-1-388/P/91, Laxmi Nagar Colony, Saidabad, Hyderabad. 500 059



**PUBLIC NOTICE**

This is to inform all the potential buyers, mediators, real estate agencies. asset management companies etc, that the residential plot described below is a subject matter of the ongoing legal dispute, the issue of rights over property is subjudice and is pending before the Hon'ble XXVI Addl Chief Judge, City Civil Courts, Hyderabad, vide O.S.No. 285 of 2024. Therefore, any person interested in acquiring the property described below and hereby notified about the ongoing dispute and hereby advised to refrain from creating any encumbering or acquiring the schedule property as the rights to the property is subject matter of outcome of the ongoing legal dispute

**SCHEDULE PROPERTY**
Plot Nos.43 & 48 situated in Sy.No.129/68 paiki of Shaikpet Village (Road No.12, Banjara Hills) Hyderabad Correlated to TS No.11,12/2, Block-H, Ward No.10 of Shaikpet Village.

**Sd/- Rachna Reddy & Associates**
Sai Chitra Nagar, 3-4-114/14, Lane No.6, Beside Manasa Hospital, Ramanthapur, Hyderabad-500013.

## విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ దేవ్ వర్మ



సంజనకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** విద్యార్థులు అంకుటిత దీక్ష, పట్టుదల, కృషితో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మలక్ పేట్ మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త చిగు మల్ల మల్లికార్జున్ కుమార్తె చిగుమల్ల సంజన ప్రతిష్టాత్మకమైన ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ (ఐపిఈ) లో తన మాస్టర్స్ పీజీ విద్యను విజయవంతంగా పూర్తిచేశారు.నిరంతర కృషి, విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభను చాటుతూ ఆమె టాప్ ర్యాంక్ ను సాధించారు. ఈ విశేష సాధనకు గుర్తింపుగా, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా సర్టిఫికెట్ను చిగుమల్ల సంజన అందుకున్నారు. ప్రతిష్టాత్మకమైన ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ లో టాప్ ర్యాంకును సాధించి ఉత్తమ మెరిట్ అవార్డును అందుకోవడం పట్ల చిగుమల్ల సంజనను పలువురు అభినందించారు. ఈ ఘనత ఆమె పట్టుదల, లక్ష్యసాధన, అంకుటిత దీక్షకు నిదర్శనమని, భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని అధ్యాపకులు ఆకాంక్షించారు. ఉత్తమ ర్యాంకు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని మలక్ పేట్ లో నివసిస్తున్న చిగుమల్ల సంజన నివాసానికి పలువురు తరలి వెళ్లి పుష్పగుచ్ఛాలని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి



అమ్మవారి ఒడిబియ్యాన్ని భక్తులకు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట డిసెంబర్ 15, ప్రభాతవార్త:** మలక్ పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవాలయంలో అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యాన్ని దేవాలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, కమిటీ సభ్యులు చౌకి రవి కుమార్, శ్రీనివాస్ గుప్తా, శివకుమార్, టి. శ్యామ్ రాజ్ కుమార్, బుర్ర బాలరాజ్ గౌడ్, దశరథ్ లు భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ దేవాలయంలో ప్రతినిత్యం పలు పూజా కార్యక్రమాలను, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఓటు చోరీకి పాల్పడుతున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలి : చెకొలేకర్ శ్రీనివాస్



రాష్ట్ర మాజీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ తదితరులతో భేటీ అయిన చెకొలేకర్ శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ఓటు చోరీకి పాల్పడుతున్న వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఓటు చోరీపై ఏఐసీసీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, హైదరాబాద్ డిసిసి అధ్యక్షులు సయ్యద్ సైఫుల్లా, పలువురు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ తదితరులతో చెకొలెకర్ శ్రీనివాస్ భేటీ అయి పలు అంశాల గురించి చర్చించారు. అనంతరం చెకోలేకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ఓటును చోరీ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఓటు చోరీ అంశాన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : డిసి



**నేరేడ్ మెట్, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాతీయ సుల్తానా అధికారులకు సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 8 పిర్యాదులు అందాయని తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, ఇంజనీరింగ్ విభాగానికి 3, వెటర్నరీ విభాగానికి 1, ఎలక్ట్రికల్ విభాగానికి 1, యు.బి.డి. విభాగానికి 1 పిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆమె సూచనలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.



బృందావన్ మెడోస్ కాలనీ నూతన సంవత్సర క్యాలెండర్ (2026)ను ఆవిష్కరిస్తున్న టి.పి.సి.సి.ప్రచారకమిటి చైర్మన్, మాజీ ఎం.పి.మధుయాష్కీ గౌడ్.చిత్రంలో కాలనీ అధ్యక్షుడు శశిధర్ తదితరులు.(ప్రభాతవార్త.. వనస్థలిపురం).

# మైనార్టీలకు చేయూతనివ్వండి

-మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**నేరేడ్‌మెట్, డిసెంబర్ 15,ప్రభాతవార్త :** మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం మరింత తోడ్పాటు అందించాలని మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ మంత్రి అజారుద్దీన్ను, మైనార్టీ వెల్ఫేర్ సెక్రెటరీ షఫీఉల్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవ మైనార్టీలకు అవసరమైన సంక్షేమ చర్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల సందర్భంగా క్రైస్తవులకు అందించే ఫీస్ట్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని, చర్చిలకు పెయింటింగ్, ఎలక్ట్రికల్ లైటింగ్ పనుల కోసం ఆర్థిక సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ముస్లిం-క్రైస్తవులకు స్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని, పాస్టర్లకు జీతాలు అందించే విధానంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, హోలీ ల్యాండ్ టూర్‌కు క్రైస్తవ సోదరులను తీసుకెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి అజారుద్దీన్, సెక్రెటరీ షఫీఉల్లా సానుకూలంగా స్పందిస్తూ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, ఆకుల నర్సింగ్ రావు, బి.ఆర్.ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, రాము యాదవ్, అమీనుద్దీన్, డోలి రమేష్, సాయి గౌడ్, సంపత్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, వంశీ ముదిరాజ్, చిన్న యాదవ్, హేమంత్ పటేల్, ఢిల్లీ పరమేష్, శోభన్ బాబు, మోసీన్, పవన్, రేవంత్ రెడ్డి, దినేష్ క్రైస్తవ సంఘాల నాయకులు లియోనార్డ్ మీఘర్, దినకర్, సాల్మన్, డేవిడ్ ఫ్రాంక్లిన్, శర్వానంద్ తదితరులు ఉన్నారు.

## జిల్లెలగూడలో రాజా బహదూర్ వెంకటరామారెడ్డి విగ్రహావిష్కరణ



జిల్లెలగూడ చందన చెరువు కట్టపై రాజా బహదూర్ వెంకటరామారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి మీర్‌పేట్ సర్కిల్ పరిధిలోని జిల్లెలగూడలో రాజా బహదూర్ వెంకట రామారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. నాటి 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో 19 శతాబ్దం చివరలో 20 శతాబ్దం ప్రారంభంలో 14 సంవత్సరాల పాటు అప్పటి హైదరాబాద్ నగరానికి ప్రప్రథమ హిందూ కొత్వాల్ (సిటీ పోలీస్ కమీషనర్)గా అత్యుత్తమ సేవలు అందించి ఆనాటి అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందడమే కాకుండా బ్రిటిష్ పాలకులతో పురస్కారాలు అందుకున్న వెంకట రామారెడ్డి నిలువెత్తు భారీ విగ్రహాన్ని స్థానిక చందన చెరువు కట్టపై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లెలగూడ రెడ్డి సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, సౌజన్యంతో సోమవారం ఉదయం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రెడ్డి సంఘం కార్యవర్గంతో పాటు పలువురితో కలిసి వెంకట రామారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకటరామారెడ్డి అందించిన సేవలను కొనియాడారు. టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకటరామారెడ్డి గౌరవార్థం తెలంగాణ పోలీస్ అకాడెమీకి ప్రభుత్వం ఆయన పేరు పెట్టడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ మండల మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్‌రెడ్డి, విగ్రహ దాతలు చల్లా ప్రభాకర్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లెలగూడ రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు బొక్క రాజేందర్‌రెడ్డి, కొత్త జయసింహారెడ్డి, పోరెడ్డి జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సప్పిడి జంగారెడ్డి, సంయుక్త కార్యదర్శులు జిల్లెల దామోదర్‌రెడ్డి, అర్కల కాశీనాథ్‌రెడ్డి, కోశాధికారి బెదదల సురేందర్‌రెడ్డి, సోషల్ మీడియా ఇంఛార్జి పోరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మల్లెల విజయభాస్కర్‌రెడ్డి, నాందారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లెలగూడ మాజీ ఉప సర్పంచ్‌లు అర్కల భూపాల్‌రెడ్డి, మేకల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి జిల్లెల జనార్ధన్‌రెడ్డి, బొక్క రాంరెడ్డి, కొత్త రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి



సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, శ్రీవాణి, డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌గుప్త తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 15 ప్రభాతవార్త :** భారత తొలి ఉప ప్రధాని, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా సోమవారం రామంతాపూర్ ప్రధాన రహదారిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పలువురు నేతలు పూల మాలలువేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు, బిజెపి డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్‌గుప్త, మాజీ కౌన్సిలర్ తిండేరు హనుమంతరావు, సీనియర్ నేత గద్దం సాయికిరణ్, వల్లపు జగన్ యాదవ్, ముత్తినేని జగదీష్, డివిజన్ కార్యదర్శులు చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు పటేల్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు బండి పద్మ, దారం వెంకటేష్ గుప్త, పీసరి శంకర్, పుచ్చుల అశోక్, జి హరిబాబు, నందికంటి శివ, గద్దం వెంకట్ సాయి, తుమ్మలి రవి, తోట శ్రీనివాస్, గుర్రం మహేష్, తాళ్ల బాలకృష్ణ గౌడ్, వెంపటి శ్రీనివాస్, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, బి.ఆనంద్, రామరాజ్, మురళీ, సురేష్, పలుగుల అంజయ్య, దర్శనాల సుధాకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

## బహుజనుల ఆరాధ్యుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మన్సూరాబాద్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** జనగాం జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ మాజీ మండలి చైర్మెన్ స్వామి గౌడ్ లు తెలిపారు. ఎల్బీనగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ లో వారు పాల్గొని ఈ మాట్లాడుతూ. బహుజనుల గౌరవం, ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సమాజానికి ఆయన చేసిన త్యాగాలు, సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఇటువంటి మహనీయుల చరిత్రను రాబోయే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం బహుజన చైతన్యానికి, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ,వనంపెల్లి శ్రీనివాస్ రెడ్డి , బీసీ సంఘము జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ గౌడ్ సంఘము రాష్ట్ర నాయకులు బాలరాజ్ గౌడ్ జైహింద్ గౌడ్ ,అంబాలా నారాయణ గౌడ్ ,గౌడ్ హాస్టల్ అధ్యక్షులు చక్రవర్తి గౌడ్ ,పల్లె రవి గౌడ్, ఐలా వెంకన్న గౌడ్, ముద్దగోని లక్ష్మి ప్రసన్న గౌడ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా రెడ్డి పవన్ ప్రేమ్ వంగ మధుసూదన్ రెడ్డి మాజీ కార్పొరేటర్లు కొప్పుల విట్టల్ రెడ్డి, సాగర్ రెడ్డి ,జక్కిడి మల్లారెడ్డి , జక్కిడి రఘువీర్ రెడ్డి ,చింతల్ సురేందర్ యాదవ్ ,కొత్త రవీందర్ గౌడ్ ,ముద్దగోని లక్ష్మి ప్రసన్న గౌడ్, కుంట్లూర్ వెంకటేష్ గౌడ్ , కూరెళ్ల వేములయ్య గౌడ్, సుర్వి రాజు గౌడ్ వెంకటేష్ గౌడ్ ,అద్దాల రమేష్ విగ్రహ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అంబాలా మల్లేష్ గౌడ్ పల్లె గణేష్ గౌడ్ కొత్త వెంకట్ గౌడ్ , రావుల సంతోష్ గౌడ్ , రమణ గౌడ్ కిషోర్ లక్ష్మిపతి గౌడ్ రాజు గౌడ్ సిద్దగాని సిద్దగాని జగదీష్ గౌడ్ బిఆర్ ఎస్, కాంగ్రెస్, బీజేపీ మరియు వివిధ కుల సంఘనేతలు, గౌడ్ సంఘము నాయకులు పాల్గొన్నారు

## మేడ్చల్ నియోజకవర్గంలో డివిజన్లు పెంచాలి : వజ్రేష్ మాదవ్



మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ మేయర్లు అజయ్ యాదవ్ , అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్లు తదితరులు

**బోడుప్పల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త ;** జీహెచ్ఎంసీలో విలీనమైన మేడ్చల్ నియోజకవర్గంలో జనాభా విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు డివిజన్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేంనరేందర్ రెడ్డి , మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , జీహెచ్ఎంసీ కమిషనర్ కర్నన్ ని కలిసి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ...డివిజన్ల సంఖ్య పెరిగితే ప్రజాసమస్యలపై త్వరితగతిన స్పందించడానికి, పాలన మరింత సమర్థవంతంగా సాగడానికి అవకాశం ఉంటుందని వివరించారు..మేడ్చల్ జిల్లా ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్ రెడ్డి , మేడ్చల్ మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి , మాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, , అమర్ సింగ్ , మాజీ డిప్యూటీ మేయర్లు కుర్ర శివకుమార్ గౌడ్ ,కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, ఫిర్జాదిగూడ పట్టణ అధ్యక్షులు తుంగతుర్తి రవి , మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్ , బింగి జంగయ్య యాదవ్ , చీరాల నరసింహ్మ , కాంగ్రెస్ నాయకులు ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైకోర్టుకాలనీ డివిజన్‌గా ఏర్పడడం హర్షణీయం



దీపావళి శ్రవణ్ కుమార్‌ను సత్కరిస్తున్న ఆలయకమిటి సభ్యులు.

**వనస్థలిపురం. డిసెంబర్.15.ప్రభాతవార్త.** జిహెచ్ఎంసి వార్డుల పునర్విభజనలో భాగంగా నూతనం గా హైకోర్టు కాలనీని 48 వార్డు గా ఏర్పాటు చేయడం హర్షణీయమని బి.ఆర్.ఎస్. పార్టీ సీనియర్ నాయకులు రాజప్ప నగర్ నివాసి దీపావళి శ్రవణ్ కుమార్,గుత్తా లక్ష్మారె డ్డి, దీపావళి శ్రీకాంత్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు హైకోర్టు కాలనీలో గల శ్రీ సిద్ధి వినాయక ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రవణ్ కుమార్,లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ లను శాలువాలతో సత్కరించారు.రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తమకు అవకాశం కల్పిస్తారని ఆశాభావంవ్యక్తం చేశారు.

## ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మధు యాష్కీ గౌడ్ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎల్బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధుయాష్కీ గౌడ్

**సైదాబాద్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** ఎల్బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, టిపిసిసి ప్రచార కమిటి ఛైర్మన్ మధు యాష్కీ గౌడ్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఎల్బినగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు మధుయాష్కీకి ఆశీర్వచనం చేసి స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ పాలక వర్గాల ఛైర్మన్లు, మాజీ ఛైర్మన్లు, డైరెక్టర్లు,మాజీ డైరెక్టర్లు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సయ్యద్ రిజ్వాన్ తదితరులు

**సైదాబాద్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** టిపిసిసి ప్రచార కమిటి ఛైర్మన్, ఎల్బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధు యాష్కీ గౌడ్ జన్మదినం సందర్భంగా లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పేద మహిళలు అయిదు వందల మందికి చీరలు పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కాసిన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శాలిని, మస్జిద్, ఇమామ్, అక్బర్ అలీ, షాకీర్, అనిల్ యాదవ్, అక్రమ్ భాయి, అమెర్,శ్రీధర్‌గౌడ్, రమేష్, విజయ, లోకేష్ పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్‌లో ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 15,ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో చర్చి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. క్రిస్మస్ పండుగకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మ న్ గోన ఫిలిప్, అధ్యక్షుడు అశోక్, అగ్రిపరాజు, సల్ల ప్రభాకర్ రెడ్డి, వసంత్ కుమార్, జెసిడిపల్లి యోహాన్, జాకబ్, టి చంద్రపాల్, టెంజోనియా, టి.రాకేష్, ,దేవదాస్, డేవిడ్ సన్, రాజు, రమేష్, పాల్గొన్నారు.

## వినాయక్ నగర్‌ను కాకతీయనగర్‌గా సవరించాలని వినతి



**నేరెడ్ మెట్, డిసెంబర్ 15,ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి పరిధిలో ఇటీవల ప్రకటించిన వార్డుల విభజన ప్రక్రియతో పలు ప్రాంతాల్లో గందరగోళం నెలకొనగా, డివిజన్ వార్డుల పేర్ల సవరణ కోరుతూ కాలనీవాసుల వినతుల పరంపర కొనసాగుతోంది. ఇందులో భాగంగా వినాయక్ నగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు మల్కాజిగిరి సర్కిల్ అభ్యంతర కేంద్రములో వినతిపత్రం అందజేశారు. తాజా వార్డు విభజనలో తమ ప్రాంతాన్ని "వినాయక్ నగర్"గా నమోదు చేయడం జరిగిందని, అయితే వాస్తవంగా ఆ ప్రాంతంలోని అధిక భాగం కాకతీయ నగర్ పరిధిలోనే ఉంటుందని తెలిపారు. అసలు వినాయక్ నగర్ ప్రాంతం తాజా విభజన ప్రకారం సఫిల్‌గూడ వార్డులోకి వెళ్తుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పేరుతో కొనసాగితే ప్రజల్లో అయోమయం ఏర్పడే అవకాశముందని పేర్కొన్నారు.కావున తాజా 187వ డివిజన్ ప్రకారం తమ వార్డు పేరును"వినాయక్ నగర్" నుండి "కాకతీయ నగర్"గా సవరించాలని కోరుతూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వార్డు పేర్లపై స్పష్టత తీసుకురావాలని వారు కోరారుఈ కార్యక్రమం లో ఎన్. ప్రభాకర్ రెడ్డి, రామ్ చంద్ర, గోపాల్, సాయి సాగర్, వెంకటేష్ చారి, జోసెఫ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిసె వాసుల సమస్యల పరిష్కారానికి కృషి : విజయభాస్కర్‌రెడ్డి



బస్తీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న మడిగెల విజయభాస్కర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని గడ్డి అన్నారం పిల్లి గుడిసెలు బస్తీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇంటర్నేషనల్ రైట్స్ కమిటి ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మడిగెల విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బస్తీలోని సమస్యలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీలో అర్హులైన వారందరికి పింఛన్లు ఇప్పించడానికి కృషి చేస్తానని, త్రాగునీటి సమస్య పరిష్కారంలో తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. గుడిసె వాసులకు నిరంతరం అందుబాటులో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

## సమాజానికి రెడ్లు ఆదర్శంగా ఉండాలి : నరేందర్‌రెడ్డి



జిల్లెల నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న జిల్లెలగూడ రెడ్డి సంఘం నాయకులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** రెడ్లు సమాజానికి ఆదర్శంగా ఉండాలని సరూర్‌నగర్ మండల మాజీ జడ్పీటిసి, సీనియర్ నాయకుడు జిల్లెల నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లెలగూడ చందన చెరువు కట్టపై రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాజా బహదూర్ వెంకటరామారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బొక్క రాజేందర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నరేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ కాలం నుండి రెడ్లలో ఎంతో మంది మహానుభావులు, సంఘ సంస్కర్తలు ఉన్నారనీ వారిని ఆదర్శంగా చేసుకొని ముందుకు సాగాలని కోరారు. ముఖ్యంగా అన్ని వర్గాల వారిని కలుపుకొని పోతూ సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సప్పిడి జంగారెడ్డి, కొత్త జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చందన చెరువు అసంపూర్తి సుందరీకరణ పనులు పూర్తి చేయిస్తా : సబితారెడ్డి



చందన చెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి మీర్‌పేట్ సర్కిల్ పరిధి కిందకు వచ్చే జిల్లెలగూడ చందన చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆమె చెరువును సందర్శించి స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2021వ సంవత్సరంలోనే చెరువు సుందరీకరణ అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు చేయిస్తే రూ.2.25 కోట్లు మంజూరు కావడం జరిగిందని అన్నారు. సదరు నిధులతో వివిధ పనులు చేయించామని ఆమె వివరించారు. ఇంకా అసంపూర్తి పనులున్నందున త్వరలో అవి పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్, మాజీ ఎంపిటిసి పాలపర్తి విజయలక్ష్మి, సిద్దాల అంజయ్య, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



ప్రజావాణిలో కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజావాణి సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 15 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లోని పలు సమస్యలు పరిష్కరించాలని సోమవారం ప్రజావాణి సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నేతలు డిప్యూటి కమిషనర్ రాజును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రజావాణి సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌తోపాటు, కార్యదర్శి కె. విజయకుమార్, ఉపాధ్యక్షులు జి.కృష్ణయ్య, ఎ.శివ శంకర్ గౌడ్, సిద్ధగొని రాజుగౌడ్ తదితరులు మాట్లాడుతూ నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న సర్వీస్ రోడ్డును పూర్తి నిర్మాణం పూర్తి చేయాలని, భగాయత్‌లో రాత్రి వేళ్లలో మట్టి డంపింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కెసిఆర్ నగర్ నుండి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు వెళ్లే సర్వీస్ రోడ్డు పాడైపోయ్యిందని, కొత్త రోడ్డు కోసం గుంతలు తవ్వి వదిలివేశారని ఫిర్యాదు చేశారు. టివి కాలనీ వద్ద రోడ్డు మధ్యలో క్రాసింగ్ ఉన్నచోట శిధిలావస్థలో ఉన్న చెట్లు తొలగించాలని, సర్వీస్ రోడ్డు నందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొరకు రోడ్డున త్రవ్వి వదిలివేశారని ఫిర్యాదు చేశారు. రామంతాపూర్‌లో జలమండలి అధికారులు గుంతలు తవ్వి పూడ్చడం లేదని విన్నవించారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాజు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## శాస్త్రీయ విభజన ద్వారా డివిజన్లు ఏర్పాటు చేయాలి : బిజెపి



జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్వి కర్ణన్‌కు వినతి పత్రం ఇస్తున్న బిజెపి నాయకులు, మాజీ కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలో విలీనం చేసిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను శాస్త్రీయంగా విభజన చేసి 30 వేల ఓట్లకు ఒకటి వచ్చే విధంగా కొత్త డివిజన్లను ఏర్పాటు చేసి డివిజన్ల సంఖ్యను పెంచాలని బిజెపి నాయకులు జిహెచ్ఎంసి కమీషనర్‌ను కోరారు. సోమవారం బడంగ్‌పేట్ సెక్టార్ -2 బిజెపి అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి, పార్టీ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేషన్ బిజెపి మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, మాజీ కార్పొరేటర్లు గద్దం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన తదితరులు జిహెచ్ఎంసి కార్యాలయంలో కమీషనర్ ఆర్వి కర్ణన్‌ను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో డివిజన్ల ఏర్పాటు శాస్త్రీయంగా జరగలేదంటూ కమీషనర్‌కు ఆధారాలతో వివరించారు. 60 వేల పైచిలుకు ఓట్లు ఉన్న ప్రాంతాలను కలిపి 57 నెంబర్‌తో డివిజన్‌ను ఏర్పాటు చేశారనీ అదే విధంగా కేవలం 30 వేల ఓట్లతో బాలాపూర్ డివిజన్‌ను ఏర్పాటు చేశారని ఇది శాస్త్రీయం కాదని వారన్నారు. 30 వేల ఓట్లతో ఒక్కో డివిజన్‌ను ఏర్పాటు చేసి డివిజన్ల సంఖ్యను పెంచాలనీ ఇందు కోసం రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని వారు కోరారు. అయితే తమ వినతికి స్పందించిన కమీషనర్ డివిజన్ల ఏర్పాటుపై పునః పరిశీలన చేస్తామని హామీనిచ్చినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి యెల్చల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.